Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 271 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 11 - 6 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ప్రధాని మోదీని అభినందనలతో ముంచెత్తిన ఎన్డీయే నేతలు



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎన్డీయే నేతల పెద్దఎత్తున అభినందలు తెలిపారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకోవడం, సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన రికార్డును మోదీ సొంత చేసుకున్న నేపథ్యంలో ఎన్డీయే నేతల సమావేశం బుధవారంనాడిక్కడ భారత్ మండపంలో జరిగింది. ప్రధాన మంత్రి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో 22 ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు, ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాల నేతలు, బీజేపీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

**మోదీ రికార్డు**

భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 1964 మే 27న తుదిశ్వాస విడిచేంత వరకూ 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. ఆ రికార్డును మోదీ అధిగమించారు. 2014 మే 26న ప్రధాని పగ్గాలు చేపట్టిన ఆయన బుధవారంతో ఆ పదవిలో నిరాటంకంగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. తద్వారా దీర్ఘకాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును సొంతం చేసుకునున్నారు.

## జగన్ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు : హోంమంత్రి అనిత

**అనకాపల్లి జిల్లా, (రాజధాని వార్తలు):** జగన్ మోహన్ రెడ్డి హయాంలో పాయకరావుపేట నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉపమాక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కోసం రూ. 5.46 కోట్లు కేటాయించి, పనులు చేపట్టామని పేర్కొన్నారు. రాబోయే మూడేళ్లలో నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని అనిత వ్యాఖ్యానించారు. పాయక రావుపేట నియోజకవర్గాన్ని పర్యాటకంగా కూడా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. రెండేళ్లలో పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై హోంమంత్రి అనిత బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. రెండేళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఫొటోలతో సహా వివరించారు. పాయకరావుపేట నియోజకవర్గంలో రెండేళ్లలో సుమారు రూ. 1,150 కోట్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అనిత చెప్పుకొచ్చారు. పాయకరావుపేట నియోజకవర్గం నాలుగు మండలాల పరిధిలోని పంచాయతీరాజ్‌లో 871 పనులకు గానూ, రూ. 118 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. గ్రామాల అభివృద్ధి కోసం 172 కిలో మీటర్ల మేర రహదారులు నిర్మించామని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో ఆర్ అండ్ బీలో 36 పనులకు గానూ 137 కిలోమీటర్ల రోడ్డు, రూ. 130 కోట్లతో అభివృద్ధి చేశామని వివరించారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించటం కోసం రూ. 66 కోట్లతో 244 పనులు చేపట్టామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.





## రాజధాని అమరావతికి కేంద్రం భారీ శుభవార్త : కేంద్ర మంత్రి పెమ్మసాని




**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కేంద్రం భారీ శుభవార్త తెలిపిందని కేంద్రం ఆరోగ్య, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి సమావేశమైంది. ఈ సమావేశంలో రాజధాని అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. అమరావతిలో రూ. 2,500 కోట్ల విలువైన సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టుకు ఆమోద ముద్ర పడిందని వివరించారు. దీనిని ఐదు ఎకరాల్లో 23 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. రెండు భారీ టవర్లలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తారని వివరించారు. అలాగే 1,800 కార్ల పార్కింగ్ సదుపాయంతో ఈ ఆధునిక కార్యాలయ సముదాయం నిర్మితమవుతుందని చెప్పారు. రూ. 1,234 కోట్లతో 17 ఎకరాల్లో రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తారని తెలిపారు. 11 టవర్లలో 1,568 నివాస క్వార్టర్లు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ, కమ్యూనిటీ హాల్స్, ఆధునిక సదుపాయాలతో గేటెడ్ కమ్యూనిటీ ఏర్పాటు అవుతుందని కేంద్ర మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. 2018లో ఈ ప్రతిపాదన చేస్తే.. 2024 తర్వాత ఇది వేగంగా ముందుకు సాగుతుందని చెప్పారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, ఆర్థిక శాఖల సహకారంతో ఈ ప్రాజెక్ట్‌కు ఆమోద ముద్ర పడిం దన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఈ ప్రాజెక్ట్ సాధ్యమైందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

## ZEN ZEE కౌంటర్




కానీ అలా చేస్తే అదేవ FII ల విశ్వాసాన్ని కోల్పోతారు మరియు ఇది 20 సంవత్సరాల వంటి సుదీర్ఘ కాలం పాటు మార్కెట్లను ప్రభావితం చేస్తుంది.

## రాజధానిలో సెంట్రల్ గవర్నమెంట్ జనరల్ పూల్ ఆఫీస్ అకామిడేషన్ నిర్మాణానికి కేంద్ర కెబినెట్ నిర్ణయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం




### - ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపిన సీఎం చంద్రబాబు
### - ఎక్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతిలో సెంట్రల్ గవర్నమెంట్ జనరల్ పూల్ ఆఫీస్ అకామడేషన్ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రాతినిధ్యాన్ని మరింత పెంచేలా కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆధునిక, పర్యావరణ అనుకూలంగా కేంద్ర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఆమోదం తెలపడం అమరావతి అభివృద్ధిలో మరొక కీలకమైన అంశం. రాజధానిగా అమరావతి అభివృద్ధికి, భవిష్యత్తు వృద్ధికి అవసరమైన పరిపాలనా మౌలిక సదుపాయాల కల్పనకు ఈ ప్రాజెక్ట్ ఊతమిస్తుంది. ఏపీలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ఒకే చోటకు తీసుకు రావడం ద్వారా పాలనను సులభతరం అవుతుంది. అమరావతికి కేంద్రం అందిస్తున్న చేయూతను.. సహకరిస్తున్న తీరుకు ఈ నిర్ణయం అద్దం పడుతోంది.

## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఒక ఉద్యోగిని తొలగించలేదు: మంత్రి కొండపల్లి

**అమరావతి, (రాజధాని వార్తలు):** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదం అత్యంత బాధాకరమని ఎంఎస్‌ఎంఈ, ఎన్నారై శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాజధాని అమరావతిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్‌ఎంఎస్ 1లో జరిగిన రెండో పేలుడు వల్ల 8 మంది కార్మికులు మృతి చెందారని చెప్పారు. ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఆరుగురికి ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన అలర్ట్ సిస్టమ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ ప్రమాదం జరిగిన తర్వాత కేంద్ర మంత్రులు కుమారస్వామి, రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ ఘటనా స్థలానికి వెళ్ళి పర్యవేక్షించారని గుర్తు చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన బాధితులను పరామర్శించి.. వారిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ధైర్యం నింపారన్నారు. ఈ ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణకు ఉమ్మడి కమిటీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేశాయని చెప్పారు. మృతి చెందిన పర్మనెంట్ ఉద్యోగుల కుటుంబాలకు మొత్తం రూ. 2 కోట్ల వరకు ఆర్థిక ప్యాకేజీ అందుతుందని వివరించారు. బాధిత కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగంతో పాటు పిల్లల ఉచిత చదువుల బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు కూడా రూ.కోటి వరకు నష్టపరిహారం అందజేస్తామని మంత్రి కొండపల్లి చెప్పారు. బాధిత కుటుంబాలు ప్లాంట్ క్వార్టర్స్‌లోనే శాశ్వతంగా నివసించేలా వసతి కల్పిస్తామన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితు ల్లోనూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'శవ రాజకీయం' చేయడం దారుణమన్నారు. స్టీల్ ప్లాంట్‌లో ఒక్క ఉద్యోగిని కూడా తొలగించలేదని స్పష్టం చేశారు. వైఎస్ జగన్ చెబుతున్న అబద్ధాలను నమ్మొద్దంటూ ప్రజలకు మంత్రి కొండపల్లి సూచించారు. కేంద్రం ఇచ్చిన రూ. 11,440 కోట్ల నిధులపై లెక్కలన్ని పక్కాగా ఉన్నాయని.. ఒక్క రూపాయి కూడా మళ్లించలేదని కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. రా మెటీరియల్‌కు రూ. 4 వేల కోట్లు, ప్లాంట్ అప్‌గ్రేడేషన్‌కే రూ. 5 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. వైఎస్ జగన్ హయాంలో 30 శాతానికి పడిపోయిన ప్లాంట్ ఉత్పత్తి.. నేడు 95 శాతానికి పెంచామని గుర్తు చేశారు. ఈ కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో నేడు 6 లక్షల టన్నుల మార్క్‌ను దాటి విశాఖ ఉక్కు సంస్థ ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంలో 12 మంది చనిపోతే కేవలం ముగ్గురికే రూ. కోటి ఇచ్చారని విమర్శించారు. నాడు బాధితులకు ఇచ్చింది కంపెనీ సొమ్మే కానీ, వైసీపీ ప్రభుత్వం సొంతంగా ఇచ్చింది కాదని పేర్కొన్నారు. ఎల్జీ పాలిమర్స్ బాధితులకు కట్టిస్తా మన్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏమైందో చెప్పాలని వైఎస్ జగన్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూటిగా ప్రశ్నించారు. నాడు విమానాశ్రయంలో మీటింగులు పెట్టిన వైఎస్ జగన్.. నేడు ప్రజల వద్దకు మంత్రులు వెళ్తుంటే ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్లలో 'పోస్కో' కంపెనీతో రహస్య ఒప్పందాలు చేసుకుని.. విశాఖ స్టీల్ ప్లాంట్ భూములపై కన్నేసింది నిజం కాదా? అని మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మంత్రి కొండపల్లి సూటిగా ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు చొరవతోనే కేంద్రం రూ. 500 కోట్లు ఇచ్చి.. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుందని గుర్తు చేశారు. బాధిత కుటుంబాల ఓదార్పులోనూ ఓట్ల రాజకీయం చేయడం 'గొడ్డలి పార్టీ' నైజానికి నిదర్శనమంటూ వైసీపీ నేతల తీరును మంత్రి కొండపల్లి ఎండగట్టారు.



## నేడు ఖర్గే సారథ్యంలో ఏఐసీసీ అత్యవసర సమావేశం

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఏఐసీసీ అత్యవసరంగా సమావేశమవుతోంది. జూన్ 11న ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం జరుగనుంది. పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు, పీసీసీ అధ్యక్షులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఏఐసీసీ అత్యవసర సమావేశం ప్రధాన ఎజెండా ఏమిటనేది పార్టీ అధిష్ఠానం ఆ సర్క్యులర్‌లో పేర్కొనలేదు. అయితే మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ్య నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తోసిపుచ్చిన అంశం ప్రధానంగా ఈ సమావేశంలో చర్చకు రానుందని, దీనికి సంబంధించి భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించనున్నారని తెలుస్తోంది. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడంతో కాంగ్రెస్ ప్రతినిధి బృందం ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు బుధవారం నాడు కలిసి ఫిర్యాదు చేసింది. తక్షణం చర్యలు తీసుకోవాలని కోరింది. ఇది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యని ఆరోపించింది. దీనిపై న్యాయపోరాటానికి కూడా కాంగ్రెస్ సిద్ధమవుతోంది. మరో వైపు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురి కావడంతో రాజ్యసభ ఎన్నికల్లో మూడో అభ్యర్థిగా నిలబెట్టిన మహేశ్ కావత్ విజయంపై బీజేపీ ధీమాగా ఉంది.



# సామాజిక న్యాయం - సమగ్ర సాధికారత దిశగా చారిత్రాత్మక అడుగులు

## - విద్య, ఉపాధి, సంక్షేమం, దివ్యాంగుల అభివృద్ధి, గ్రామ-వార్డు పరిపాలనలో విశిష్ట పురోగతి

## - రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మాత్యులు డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

**అమరావతి, (రాజధాని వార్తలు):** సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, అట్టడుగు వర్గాల సమగ్ర సాధికారత అనే మహత్తర లక్ష్యాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమ పరిపాలనకు కొత్త దిశను నిర్దేశిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు & వృద్ధుల సంక్షేమం, స్వర్ణ గ్రామం & వార్డు శాఖా మాత్యులు డా. డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలను శాశ్వతంగా తొలగించాలంటే విద్య, నైపుణ్యం, ఉపాధి, ఆరోగ్యం, గౌరవప్రద జీవనం అనే అంశాలను సమగ్రంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు. ఆ దిశగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గురుకులాలు, హాస్టళ్లు, స్టడీ సర్కిల్స్, స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, దివ్యాంగుల సంక్షేమ పథకాలు, స్వర్ణగ్రామం & వార్డు వ్యవస్థల ద్వారా అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని తెలిపారు.

**విద్యా సాధికారతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం:**

ఎస్సీ విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా నిలుస్తూ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద రూ. 1,543.17 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసి 5.40 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చామని మంత్రి వెల్లడించారు. అలాగే ప్రీ మెట్రిక్ విద్యార్థులకు "తల్లి కి వందనం" కార్యక్రమం ద్వారా రూ. 326.74 కోట్లను 2.51 లక్షల మందికి అందజేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు మధ్యలో చదువు మానేయకుండా, కార్పొరేట్ స్థాయి విద్యను ప్రభుత్వ వ్యవస్థలోనే అందజేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని చెప్పారు. నీట్, జేఈఈ, సివిల్స్, గ్రూప్స్, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు నాణ్యమైన కోచింగ్‌ను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. డీఎస్సీ కోచింగ్ ద్వారా 2,000 మందికి శిక్షణ ఇవ్వగా, అందులో 331 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లుగా అనేక మంది ఉద్యోగాలు సాధించడం ద్వారా ప్రభుత్వ కోచింగ్ వ్యవస్థ సమర్థతను నిరూపించిందన్నారు.

**గురుకులాలు - హాస్టళ్లలో రికార్డు స్థాయి ఫలితాలు:**

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడ్డాయని మంత్రి తెలిపారు. టెన్త్ లో 85.32 శాతం, ఇంటర్మీడియట్‌లో 72.30 శాతం







ఫలితాలు నమోదయ్యాయని చెప్పారు. ప్రత్యేకంగా గురుకులాల్లో టెన్త్‌లో 89 శాతం, ఇంటర్మీడియట్‌లో 92 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషమన్నారు. ఇంటర్మీడియట్‌లో 950కు పైగా మార్కులు 45 మంది విద్యార్థులు సాధించగా, టెన్త్లో 591 మార్కులు సాధించిన విద్యార్థి హాస్టల్ నుంచే రావడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు నగదు బహుమతులు, ప్రత్యేక సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నీట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లోనూ విద్యార్థులు రాణించేలా నాలుగు ఎక్సలెన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ విద్యను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.

**హాస్టళ్లలో సమగ్ర మౌలిక వసతుల కల్పన:**

విద్యార్థులకు సురక్షిత, పరిశుభ్రమైన, గౌరవప్రద వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. రూ. 104.96 కోట్ల వ్యయంతో హాస్టళ్ల మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టి 774 హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరిచామని చెప్పారు. ప్రతి హాస్టల్‌లో ఆర్ఓ ప్లాంట్లు, కొత్త మెట్రెస్స్, పరిశుభ్రత నిర్వహణకు ప్రత్యేక శానిటేషన్ వ్యవస్థలు, అవుట్‌సోర్సింగ్ హౌస్‌కీపింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 989 హాస్టళ్లలో రూ. 19.80 కోట్లతో ఏఐ ఆధారిత సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి విద్యార్థుల భద్రతను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. అలాగే మెకనైజ్డ్ కిచెన్లను ప్రవేశపెట్టి పరిశుభ్రమైన, పోషకాహార భోజనం అందిస్తున్నామని చెప్పారు. వంట సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకున్నామని వివరించారు.

**విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ప్రత్యేక కార్యాచరణ:**

ప్రతి హాస్టల్, గురుకులంలో హెల్త్ సూపర్‌వైజర్లు, నర్సింగ్ సిబ్బందిని నియమించి విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 10 లక్షల వరకు వైద్య సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. హాస్టళ్లలో విద్యార్థులు కుటుంబ సభ్యుల్లా ఉండేలా వార్డెన్లు, సిబ్బంది పనిచేస్తున్నారని చెప్పారు.

**దివ్యాంగుల సంక్షేమంలో వినూత్న సంస్కరణలు:**

దివ్యాంగుల సంక్షేమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా 30 లక్షల మందికి సేవలు అందించామని, రూ. 13 కోట్లకు పైగా నిధులు కేటాయించామని తెలిపారు. 52,263 మంది దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశామని చెప్పారు. 329 దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభించామని, త్వరలో నియామకాలు పూర్తి చేస్తామని తెలిపారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ. 6,000లకు పెంచిన ప్రభుత్వం, వారికి విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ ముందంజలో ఉందన్నారు. ప్రతి కలెక్టరేట్‌లో దివ్యాంగులకు అనుకూల సౌకర్యాలు, ప్రత్యేక లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేసి వారికి గౌరవప్రద జీవనోపాధి కల్పించే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**స్వర్ణ గ్రామం & వార్డు వ్యవస్థ - ప్రజలకు చేరువైన పరిపాలన:**

స్వర్ణ గ్రామం & వార్డు వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు పారదర్శక, వేగవంతమైన సేవలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. 1.68 కోట్ల ఇళ్ల మ్యాపింగ్, 1.71 కోట్ల కుటుంబాల ఈ-కేవైసీ పూర్తి చేశామని వెల్లడించారు. డిజిలాకర్ ద్వారా ప్రతి పౌరుడు తన ముఖ్య పత్రాలను డిజిటల్‌గా భద్రపరుచుకునే అవకాశం కల్పించామని తెలిపారు. గ్రామ, వార్డు సిబ్బందికి ప్రమోషన్లు, బదిలీల్లో పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని చెప్పారు.

**ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో రికార్డు :**

2024-25 సంవత్సరానికి ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ. 26,044 కోట్ల కేటాయింపు చేశామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ఇది 10 శాతం అధికమని పేర్కొన్నారు. కేవలం నిధుల కేటాయింపే కాకుండా వాటి వినియోగంలోనూ రికార్డు స్థాయి పురోగతి సాధించామని తెలిపారు.

**మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాలకు ప్రభుత్వం అండ:**

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కింద లక్షలాది మంది వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఎస్సీ మహిళల ఆర్థిక సాధికారత కోసం స్వయం ఉపాధి పథకాలు, సబ్సిడీ రుణాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు.

**సంక్షేమం మాత్రమే కాదు - సాధికారతే ప్రభుత్వ లక్ష్యం :**

తమ ప్రభుత్వం సంక్షేమాన్ని కేవలం పథకాల పంపిణీకి మాత్రమే పరిమితం చేయడం లేదన్నారు. విద్య, నైపుణ్యం, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, గౌరవప్రద జీవనం కల్పించడం ద్వారానే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. ప్రతి బలహీన వర్గ కుటుంబం జీవితంలో స్థిరమైన మార్పు తీసుకురావడమే తమ ప్రభుత్వ ధ్యేయం అని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ, వృద్ధ, ట్రాన్సుజెండర్ కుటుంబం ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందేలా నిరంతరం కృషి కొనసాగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎమ్.ఎమ్.నాయక్, రాష్ట్ర స్త్రీ శిశు, దివ్యాంగ, వృద్ధ, ట్రాన్సుజెండర్ సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి, సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు బి.లావణ్య వేణి, ఏ.పి. గురుకుల పాఠశాలల సొసైటీ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్, స్వర్ణ గ్రామం ఉ స్వర్ణ వార్డు శాఖ సంచాలకులు శివ ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు కె.సునీల్ రాజ్ కుమార్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# డయాబెటిక్ రోగుల కంటి సమస్యలను 'ఏఐ' ద్వారా గుర్తింపు

## - ఫండస్ కెమెరాల ఇమేజ్‌ల ఆధారంగా రెటినోపతిలపై స్పష్టత - గుంటూరు, కర్నూలు, విశాఖలోని ప్రభుత్వాసుపత్రుల్లో ప్రయోగాత్మకంగా పరిశీలన : రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

**అమరావతి, (రాజధాని వార్తలు):** వైద్య సేవల్లో ఏఐ (కృత్రిమ మేధస్సు) వినియోగాన్ని కూటమి ప్రభుత్వం క్రమంగా పెంచేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే మధుమేహంతో కంటి చూపు సమస్యలు (రెటినోపతి) కలిగిన వారికి తగిన సమయంలో చికిత్స అందించడంలో ఏఐ వినియోగాన్ని ప్రయోగాత్మకంగా గుంటూరు, కర్నూలు, విశాఖలోని ప్రభుత్వాసుపత్రుల్లో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఫండస్ కెమెరాల ద్వారా తీసే ఇమేజ్‌ను పరిశీలించి, రెటినోపతి సమస్య ఎంత తీవ్రంగా ఉంది? వైద్యులను సంప్రదించాలా? వద్దా? అన్న దానిపై ఏఐ స్పష్టత ఇస్తుంది. ప్రస్తుతం వైద్యులు అందుబాటులో ఉన్నచోట మాత్రమే ఫండస్ కెమెరాలు ఉన్నాయి. ఏఐ సేవల రాకతో ఫండస్ కెమెరాలు, అప్టోమెట్రిస్ట్ (టెక్నిషియన్)లను అందుబాటులోనికి తీసుకువస్తే సరిపోతుంది. రెటినోపతి సమస్యలు గుర్తించడంలో వైద్యుల కొరతను అధిగమించేందుకు ఏఐ సాయపడుతుంది. ఇప్పటికే నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాల గుర్తింపునకు ప్రత్యేకంగా రూపొందించిన య పన్ను ఉపయోగించడంపై ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు ద్వారా పరీక్షలు చేస్తోంది ఇటీవల మెడ్ టెక్ ఛాలెంజ్ ద్వారా 18 ఆసుపత్రుల్లో 18 అంకుర సంస్థలు వైద్య సేవలు అందించింది. ఇదే క్రమంలో కంటి వైద్యంలోనూ ఏఐ సేవలను వినియోగించేందుకు వీలుగా పైలట్ ప్రాజెక్టు కింద మూడు ఆసుపత్రుల్లో కంటి పరీక్షలు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నేడు ఒక ప్రకటనలో వెల్లడించారు.

**ప్రస్తుతం...**

ప్రస్తుతం ఫండస్ కెమెరాలు ఉన్నచోట్ల మాత్రమే ఇమేజ్ ఆధారంగా రెటీనా కంటి వైద్యులు సదరు రోగుల కంటి చూపు పరిస్థితిని నిర్ధారించుకుని చికిత్స అందిస్తున్నారు. ఫండ్స్ కెమెరా లేకున్నా... డాక్టర్ లేకున్నా రెటినోపతి ట్రీట్మెంట్ జరగదు. అయితే కంటి వైద్యులు లేకున్నా fundus ఇమేజ్ ఆధారంగా ఏఐ ఇచ్చే రిపోర్టు ఆధారంగా అప్టోమేట్రిస్ట్ (స్క్రీనింగ్ చేసే వారు) తదుపరి చికిత్స అవసరం ఏ స్థాయిలో అవసరమో గుర్తించి, రోగులను అప్రమత్తం చేయడానికి వీలు ఏర్పడుతుంది. ఇప్పుడు ఈ అవకాశం లేనందున రెటినోపతి సమస్యలు ముదిరిన అనంతరం రోగులు వైద్యుల వద్దకు వెళ్లేసరికి, పరిస్థితులు చెయ్యి దాటిపోతున్నాయి. మధుమేహంతో ఉన్నవారిలో సగటున 20% మందిలో కంటి చూపు మందగించడం, నరం దెబ్బతినడం, రెటీనా పొర విడిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. గుంటూరులోని బోధనాసుపత్రికి నెలకు 3 వేల మంది వస్తుండగా 15% నుంచి 20% మంది రెటినోపతి సమస్యలతో ఉంటున్నారని గుర్తించారు. ఈ పరిస్థితుల్లో ఏఐ బేస్డ్ ఫండస్ కెమెరాలను ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులోనికి తెచ్చే కొద్దీ డయాబెటిక్ రేటినోపతి కేసులకు వైద్య సేవలు మెరుగుపడతాయి.

**ఎయిమ్స్‌ల్లో ఉత్తమ ఫలితాలు-45 వైద్య కళాశాలల్లో పరీక్షలు**


గుంటూరు జీజీహెచ్ బుధవారం మధుమేహ వ్యాధిగ్రస్తులను ఏఐ ద్వారా బుధవారం నుంచి పరీక్షించడం ప్రారంభించారు. ఇదేవిధంగా కర్నూలులోని ప్రాంతీయ ఆసుపత్రిలో ఈ నెల 13న, విశాఖలోని ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో ఈ నెల 16న రోగులను పరీక్షించనున్నారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీ ఎయిమ్స్, ఎయిమ్స్-రిషికేశ్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని అనుసరించి వాద్వాని (ఎన్జీఓ సంస్థ) 'మధునేత్ర' ఏఐ సొల్యూషన్ రూపొందించింది. ఈ రెండు సంస్థల్లో సుమారు 13 వేల మంది రెటినోపతి సమస్యలు కలిగిన వారిని పరీక్షించారు. వీటి ఫలితాలు అనుసరించి ఎయిమ్స్-బీబీనగర్, ఎయిమ్స్ రాయ్పుర్లో ప్రస్తుతం మధుమేహ వ్యాధిగ్రస్తులను పరీక్షిస్తున్నారు. వీటితోపాటు దేశంలోని రాజస్థాన్, అసోం, చత్తీస్ ఘడ్, ఢిల్లీ, హర్యానా, మధ్యప్రదేశ్, మేఘాలయ, ఒడిశ్శా, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, ఉత్తరాఖండ్, బీహార్, ఇతరచోట్ల కలిపి 45 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఏఐ ఆధారిత సేవలను 'వాద్వాని' అందిస్తోంది. ఈ క్రమంలోనే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో 3 చోట్ల మధుమేహ రోగులకు రెటినోపతి సమస్యలను పరీక్షించాలని నిర్ణయించింది. మూడునెలలపాటు వీటిల్లో పరీక్షలు జరగనున్నాయి. ఈ మూడు చోట్ల కలిపి తొమ్మిదివేల మంది రోగులను పరీ క్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇక్కడ రెటినోపతి వైద్య నిపుణులు ఉన్నారు. వీరు ఏఐ సేవలు పరిశీలించి ఇచ్చే నివేదికలు అనుసరించి కూటమి ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుంది.

**ఏఐ మదిలో 13 వేల రోగుల వివరాలు**

వాద్వాని సంస్థ 'మధునేత్ర' యాప్ లోనికి ఫండస్ కెమెరా ద్వారా తీసిన ఇమేజ్‌లను అప్లోడ్ చేస్తే.. ఏఐ రెటినోపతి సదరు రోగులకు ఉందా? లేదా? నిర్ధారిస్తుంది. అలాగే ఏ స్థాయిలో ఉందో స్పష్టం చేస్తుంది.

ఢిల్లీ ఎయిమ్స్, ఎయిమ్స్- రిషికేశ్‌లో పరీక్షించిన 13వేల మంది రోగుల రెటినోపతి వివరాలతో ఏఐను 'ట్రైనింగ్' చేశారు. దీనికి అనుగుణంగా ఎవరైనా ఫండస్ కెమెరాల ద్వారా తీసిన ఇమేజ్‌లను యాప్లోనికి అప్లోడ్ చేస్తే రెటినోపతి సమస్యల గురించి స్పష్టంగా తెలిసిపోతుంది. పైలట్ ప్రాజెక్ట్‌లో వచ్చాయి. అరుదైన కొత్త కేసుల వివరాలను కూడా ఏఐకి అందిస్తారు.

# నిర్ణీత కాల వ్యవధిలోపు ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయాలి : మంత్రి గొట్టిపాటి



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ల పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు, లో వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం కీలకమని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరఫరా పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి సూచించారు. అలానే అత్యవసర సేవల విభాగాలకు ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందించేందుకు భూగర్భ కేబులింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సచివాలయంలో బుధవారం ఇంధన శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో విద్యుత్ అంతరాయాల వల్ల రోగులు ఇబ్బందులు పడకుండా నిరంతరాయ విద్యుత్ సరఫరా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలోని సుమారు 30 ప్రధాన ఆస్పత్రుల్లో జనరేటర్ల పనితీరును సమీక్షించి, కరెంట్ నిలిచిపోయిన సమయంలో స్విచ్ ఓవర్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే విద్యుత్ శాఖ చేపడుతున్న అన్ని అభివృద్ధి ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో విద్యుత్ అంతరాయాల వల్ల భక్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన వెంటనే పునరుద్ధరణ చేయడానికి సంబంధించిన అవకాశాలను పరిశీలించాలని మంత్రి గొట్టిపాటి అధికారులను ఆదేశించారు. వేసవికాలంలో ఎదురైన విద్యుత్ సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న మంత్రి, సమస్యల పరిష్కారంపై మరింత దృష్టి సారించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఒక్క రూపాయి కూడా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా, ప్రజలపై అదనపు భారం మోపకుండా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.


ఈ సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్, డైరెక్టర్లు, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి సుస్థిర మైనింగ్‌లో మరో మైలురాయి

**ఇంటర్నెట్ డెస్క్:** సుస్థిర మైనింగ్ విధానాలు, పర్యావరణ పరిరక్షణలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మరో అరుదైన మైలురాయిని సాధించింది. మూసివేసిన డోర్లీ-2 భూగర్భ గనిని ఆదర్శవంతంగా పునరుద్ధరించి, పర్యావరణ ప్రమాణాలను పూర్తిస్థాయిలో పాటించినందుకు కేంద్రం.. ఆ సంస్థకు రూ. 40 కోట్ల ఎస్క్రో డిపాజిట్ సొమ్మును వడ్డీతో సహా తిరిగి చెల్లించింది. పర్యావరణ ప్రమాణాల అమలుపై సింగరేణిని ప్రశంసిస్తూ.. కేంద్ర కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ నుంచి సదరు నిధులను విడుదల చేసింది. గని మూసివేతలో పర్యావరణ నిబంధనలను పూర్తిగా అమలు చేసిన సింగరేణి.. బొగ్గు తవ్వకాలు పూర్తైన తర్వాత ఆ భూములను మళ్లీ పచ్చని అడవులుగా మార్చడంపై ప్రత్యేక దృష్టి సారించింది. డోర్లీ గని ప్రాంతంలో దాదాపు 162 హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో దట్టమైన అడవులను పునరుద్ధరించింది. తవ్వకాలు ప్రారంభించే ముందు సేకరించిన దాదాపు 19.76 లక్షల క్యూబిక్ మీటర్ల సారవంతమైన మట్టిని భద్రపరిచి, తిరిగి మొక్కల పెంపకానికి వినియోగించింది. గనుల్లో డ్రిల్లింగ్ సమయంలో దుమ్ము, ధూళి రాకుండా డస్ట్ కలెక్టర్లు, తడి డ్రిల్లింగ్ పద్ధతులు అనుసరించేలా సింగరేణి చర్యలు చేపట్టింది. రవాణా మార్గాల్లో వాటర్ స్ప్రింక్లర్ల ద్వారా నిరంతరం నీటిని చల్లుతూ కాలుష్యాన్ని అదుపులో ఉంచేందుకు యత్నించింది.

# "ఎయిమ్స్‌లో ఆయుష్ విభాగం ప్రారంభం"





**మంగళగిరి, (రాజధాని వార్తలు):** ఆయుష్ విభాగం ప్రారంభంతో సమగ్ర ఆరోగ్య సంరక్షణలో ఎయిమ్స్ మంగళగిరి మరో మైలురాయిని అధిగమించింది. ఎయిమ్స్ మంగళగిరిలోని ఆయుష్ విభాగాన్ని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మరియు సీఈఓ అయిన ప్రొఫెసర్ (డాక్టర్) అహంతం శాంతా సింగ్ అధికారికంగా ప్రారంభించారు. ప్రొఫెసర్ (డాక్టర్) దేసు రామ మోహన్ (డీన్ – అకడమిక్స్), డాక్టర్ రాజశేకర్ మోహన్ (మెడికల్ సూపరింటెండెంట్), కల్నల్ శశికాంత్ తుమ్మ (డిప్యూటీ డైరెక్టర్ – అడ్మినిస్ట్రేషన్), డాక్టర్ పుష్పాంజలి అకుల (మెడికల్ ఆఫీసర్ – ఆయుర్వేదం), డాక్టర్ శ్రీమంతి సన్యాల్ (మెడికల్ ఆఫీసర్ – హోమియోపతి), డి. గోవిందరావు (ఆర్థిక సలహాదారు) మరియు నర్సింగ్ అధికారులు, అలాగే సంస్థకు చెందిన ఇతర అధ్యాపకులు, అధికారుల సమక్షంలో 'ఆయుష్ విభాగం' ఈ రోజు ప్రారంభించబడింది. ఆధునిక వైద్య విధానాలతో సంప్రదాయ వైద్య పద్ధతులను అనుసంధానించాలన్న ఎయిమ్స్ మంగళగిరి నిబద్ధతకు నిదర్శనంగా, ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ మరియు హోమియోపతి విభాగాల కోసం ప్రత్యేకంగా ఈ 'ఆయుష్' బ్లాక్ ఏర్పాటు చేయబడింది. ఆయుర్వేద ఫార్మసీ మరియు పంచకర్మ సేవలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయని డాక్టర్ పుష్పాంజలి అకుల ప్రకటించారు; దీనివల్ల రోగులు సాక్ష్యాధారిత సంప్రదాయ చికిత్సలను ఒకేచోట పొందే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ఎయిమ్స్ మంగళగిరి తన ఆయుష్ సేవలను చురుకుగా బలోపేతం చేస్తోందని, సమీప భవిష్యత్తులో యోగా మరియు సిద్ధ వైద్య విధానాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నామని ప్రొఫెసర్ (డాక్టర్) అహంతం శాంతా సింగ్ తెలిపారు. సమగ్ర ఆయుష్ ఆరోగ్య సేవలను అందించే సంస్థ సామర్థ్యాన్ని మరింత పెంచేలా, త్వరలోనే ఆయుష్ విభాగంలో మరో ఇద్దరు వైద్య అధికారులు చేరనున్నారని ఆయన పేర్కొన్నారు. ఎయిమ్స్ మంగళగిరి యొక్క వేగవంతమైన అభివృద్ధి మరియు విస్తరణను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హైలైట్ చేస్తూ, కొత్తగా ప్రారంభించిన ఆయుష్ విభాగంతో పాటు ప్రస్తుతం ఈ సంస్థలో 44 క్రియాశీలక విభాగాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రీడల పట్ల పెరుగుతున్న ఆసక్తిని, అలాగే క్రికెట్ అభిమానులు మరియు క్రీడాకారుల సంఖ్య పెరుగుతున్న విషయాన్ని నొక్కిచెబుతూ, క్రీడాకారుల ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీర్చడానికి ఎయిమ్స్ మంగళగిరి ఒక స్పోర్ట్స్ మెడిసిన్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తుందని ప్రొఫెసర్ సింగ్ ప్రకటించారు. భారతదేశంలో ఆయుర్దాయం పెరుగుతున్నందున మరియు వృద్ధుల నిర్దిష్ట ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీర్చడానికి, జెరియాట్రిక్ మెడిసిన్ విభాగాన్ని మరియు ఇప్పటికే ఉన్న ఫిజికల్ మెడిసిన్ ఒ రిహాబిలిటేషన్ విభాగాన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించబడింది. ఈ సౌకర్యాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరియు దాని పరిసర ప్రాంతాలలోని విభిన్న రోగుల సమూహం యొక్క సంపూర్ణ అవసరాలను తీరుస్తాయి. అంతర్విభాగ పరిశోధన, ఆవిష్కరణ మరియు విద్యా నైపుణ్యాన్ని పెంపొందించే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా, ఐఐటి తిరుపతి సహకారంతో ఎయిమ్స్ మంగళగిరి బయోటెక్నాలజీ విభాగాన్ని ఏర్పాటు చేసే ప్రక్రియలో ఉందని కూడా ఆయన తెలిపారు.

ఈ ప్రారంభోత్సవం, ప్రాంతానికి మరియు దేశానికి ప్రయోజనం చేకూర్చేలా తన విద్యా మరియు పరిశోధన సామర్థ్యా లను విస్తరిస్తూనే, సంపూర్ణమైన, రోగి-కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణను అందించే దిశగా ఎయిమ్స్ మంగళగిరి సాగిస్తున్న ప్రయాణంలో మరో మైలురాయిని సూచిస్తుంది.


# రాజధాని అమరావతిలో ఏర్పాటు కానున్న గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్..పూర్తైన ఒప్పందం




**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రజారాజధాని అమరావతిలో మరో ప్రముఖ విద్యాసంస్థ ఏర్పాటు కానుంది. ప్రపంచ స్థాయి విద్యా సదుపాయాలతో పేరొందిన గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్ తమ విద్యాసంస్థను అమరావతిలో స్థాపించేందుకు ఏపీ సిఆర్డీఏతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం 2026 జూన్ 10న ఏపీ సిఆర్డీఏ ఒ విద్యాసంస్థను నిర్వహిస్తున్న GIIS K12 ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య జరిగింది. ఏపీ సిఆర్డీఏ తరపున జాయింట్ డైరెక్టర్ (ఎస్టేట్స్) జుబిన్ రాయ్, GIIS K12 ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున కంట్రీ డైరెక్టర్ రాజీవ్ కౌల్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ప్రాజెక్టు కోసం అమరావతి రాజధాని ప్రాంతంలోని తుళ్లూరు మండలం శాఖమూరు గ్రామంలో 4 ఎకరాల భూమిని కేటాయించారు. గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఆధునిక విద్యా ప్రమాణాలతో కూడిన పాఠశాల క్యాంపస్‌ను అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు విద్యాసంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ విద్యాసంస్థ ఏర్పాటు ద్వారా అమరావతి, పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. ఈ సంస్థ స్థాపనతో ప్రజారాజధాని అమరావతిలో విద్యా మౌలిక వసతులు మరింత బలోపేతం చెందడంతో పాటు స్థానికులకు విరివిగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# ప్రాచీన జీవన సూత్రాలు – ఆధునిక పరిపాలనా విలువల అద్భుత సమ్మేళనం

## – విజయవాడలో 'ధర్మచక్రం' పుస్తకావిష్కరణ




**విజయవాడ, (రాజధాని వార్తలు):** ప్రాచీన భారతీయ ధర్మానికి, ఆధునిక ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళికి గల అవినాభావ సంబంధాన్ని అన్వేషిస్తూ..తపాలా శాఖకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్, రాకేష్ యల్లమెల్లి రచించిన అత్యంత విశిష్ట గ్రంథం 'ధర్మచక్రం' ఆంధ్ర ప్రదేశ్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ మిస్ బి.పి. శ్రీదేవి, IPoS చేతుల మీదుగా విజయవాడలోని ఆంధ్ర ప్రదేశ్ తపాలా శాఖ ముఖ్య కార్యాలయంలో అత్యంత వైభవంగా ఆవిష్కృతమైంది. భారత ప్రభుత్వ ఉన్నతాధికారులు మరియు తపాలా శాఖకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి విచ్చేసి, పరిపాలనలో నైతికతను, కర్తవ్య నిష్ఠను చాటిచెప్పే ఒక సరికొత్త దిక్సూచిగా ఈ పుస్తకాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ మిస్ బి.పి. శ్రీదేవి, IPoS మాట్లాడుతూ జీవిత చక్రంలో ఒక వ్యక్తి యొక్క స్థానాన్ని, అర్థాన్ని అర్థం చేసుకోవడానికి మరియు కొత్త విషయాలను తెలుసుకోవడానికి ఈ 'ధర్మచక్రం' పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ తప్పకుండా చదవాలని పిలుపునిచ్చారు. పోస్ట్‌మాస్టర్ జనరల్ (కర్నూలు రీజియన్) డా. వెన్నం ఉపేందర IPoS మాట్లాడుతూ.. శ్రీరామాయణ గాథను అత్యంత సరళమైన భాషలో పరిచయం చేస్తూ, ఆ ఘట్టాలను ప్రభుత్వ ఉద్యోగ ప్రవర్తన నియమ నిబంధనలతో జోడించి, మనల్ని రామాయణ కాలంలోకి తీసుకెళ్లిన వరుస క్రమం అద్భుతమని కొనియాడారు. శ్రీరామాయణంలో లక్ష్మణుడి పాత్రను ఎంపిక చేసుకోవడం ఈ పుస్తకంలో జరిగిన ఒక గొప్ప ప్రయోగమని ఆయన ప్రశంసించారు. ఏపీసీఆర్‌డీఏ గ్రూప్ డైరెక్టర్ వెలిగోటి రాములు, IPoS మాట్లాడుతూ.. రామాయణంలో ఉద్యోగుల ప్రవర్తనా నియమావళికి సంబంధించిన అంశాలను వెలుగులోకి తెచ్చే ప్రయత్నం మొట్టమొదటిసారిగా రాకేష్ =చేశారని హర్షం వ్యక్తం చేశారు. కేవలం విషయ సేకరణ మాత్రమే కాకుండా, దానిని ప్రెసెంట్ చేసిన (ఆవిష్కరించిన) విధానంలో కూడా ఈ రచయిత చక్కటి నేర్పు ప్రదర్శించారని, రాముడి అంతరంగం లక్ష్మణుడి కన్నా ఎవరికి ఎక్కువ తెలుసని ప్రశ్నిస్తూ.. అటువంటి లక్ష్మణుడి ద్వారా ఈ రచన మొత్తం నడిపించడం రచయిత రచన నైపుణ్యానికి తార్కాణమని శ్లాఘించారు. ఎస్ శివరాం IPoS, పోస్టుమాస్టర్ జనరల్ విజయవాడ రీజియన్ మాట్లాడుతూ భారతీయ ధర్మం, పాశ్చాత్య ధర్మాలలో ఉన్న సూక్ష్మ విషయాలను తెలియజేశారు. రచయిత రాకేష్ యల్లమెల్లి మాట్లాడుతూ ఒక పాలకుడు ప్రజల పట్ల ఎలా ఉండాలో రామాయణం తెలియజేస్తుందని, వేల సంవత్సరాలు గడిచినా రామాయణం పాతబడలేదని, మనిషి ధర్మాన్ని అన్వేషించేంత కాలం రామాయణం సజీవంగానే ఉంటుందని అని తెలియజేశారు. ఈ పుస్తకావిష్కరణ మహోత్సవానికి విశిష్ట అతిథులుగా వెన్నం ఉపేందర్ IPoS, వెలుగోటి రాములు IPoS, గ్రూప్ డైరెక్టర్, ఎస్ శివరాం IPoS, పోస్టుమాస్టర్ జనరల్ విజయవాడ రీజియన్, సంతోష్ నేత కైరంకొండ IPoS, అభిలాష్ పాశం, IP &TAFS, శివ వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**పుస్తకం ప్రత్యేకత**

'ధర్మచక్రం' గ్రంథం పరిపాలన, నైతిక విలువల సమ్మేళనంగా రూపుదిద్దుకుంది. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కండక్ట్ రూల్స్, 1964 ను ప్రాచీన రాజనీతిజ్ఞతతో, సాహిత్య విశేషాలతో ముడిపెడుతూ ఈ పుస్తకాన్ని మలిచారు. ధర్మం కార్యాన్ని నిర్దేశిస్తుంది.. కర్తవ్యం దేశాన్ని నిర్మిస్తుంది అనే నినాదంతో సాగే ఈ గ్రంథం ఉద్యోగులకు, పరిపాలకులకు మరియు సాధారణ పాఠకులకు ఒక ఉత్కృష్టమైన మార్గదర్శిగా నిలుస్తుంది. ఈ ఘనమైన పుస్తకాన్ని సమాజానికి అందించిన రచయిత రాకేష్ యల్లమెల్లిని సహచర అధికారులు, సాహితీప్రియులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం వందన సమర్పణతో విజయవంతంగా ముగిసింది.

# చాముండేశ్వరి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట

## - రెండేళ్ల కూటమి పాలనలో గంగపట్నానికి రూ.3.56 కోట్ల నిధులు : కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి







**ఇందుకూరుపేట, (రాజధాని వార్తలు):** ఇందుకూరుపేట మండలం, గం గపట్నం గ్రామంలో కొలువై ఉన్న చాముండేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. భక్తులకు సజావుగా దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం గంగపట్నం ఆలయ ప్రాంగణంలో ఈ నెల జూన్ 21 నుంచి జులై 02 వరకు 10 రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఆలయ చైర్మన్, పాలకమండలి సభ్యులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, కోవూరు నియోజకవర్గంలో జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి ఆలయంతో పాటు మొత్తం 8 ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఉండడం నియోజకవర్గం ప్రజల అదృష్టం అన్నారు. జూన్ 21 నుంచి ప్రారంభమయ్యే అమ్మవారి బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని చెప్పారు. ముఖ్యంగా జూన్ 29న అమ్మవారి కళ్యాణోత్సవం, జూన్ 30న గంగోత్సవం, జులై 1న రథోత్సవం, జులై 2న తెప్పోత్సవం రోజుల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి లోటు లేకుండా చూడడమే మన లక్ష్యమన్నారు.

**అధికారులకు ఎమ్మెల్యే కీలక ఆదేశాలు**

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల కోసం వివిధ ప్రభుత్వ శాఖలకు ఎమ్మెల్యే కీలక ఆదేశాలు ఇచ్చారు. దేవాదాయ శాఖ, భక్తుల రద్దీకి తగ్గట్టుగా ప్రత్యేక క్యూలైన్లు నిర్మించాలని, నిరంతర తాగునీటి సరఫరా, ఉచిత ప్రసాద వితరణ జరిగేలా చూడాలని చెప్పారు. ప్రత్యేక వాలంటీర్లను, ఇతర ఆలయాల నుంచి అదనపు సిబ్బందిని వాడుకోవాలన్నారు. పోలీసు శాఖ, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా రథోత్సవం, తెప్పోత్సవం రోజుల్లో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ అధికారులు, ఆలయ పరిసరాల్లో, వీధుల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిరంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. విద్యుత్ శాఖ ఉత్సవాల సమయంలో నిరంతరాయంగా కరెంట్ అందించాలని, రథోత్సవ మార్గంలో వైర్లు అడ్డురాకుండా చూడాలని ఎమ్మెల్యే చెప్పారు. అత్యవసర సేవలకై ఎలక్ట్రికల్ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. అగ్నిమాపక శాఖ రథోత్సవం, తెప్పోత్సవం రోజులలో అగ్నిమాపక వాహనాలతో పాటు రక్షణ సామాగ్రి సిద్ధంగా ఉంచాలని, సిబ్బంది ప్రతిరోజూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రోడ్లు, భవనాల శాఖ ఉత్సవానికి ముందే రథాన్ని పరిశీలించి ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇవ్వాలని, పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంటు, తెప్పోత్సవం రోజున తెప్ప ఏర్పాటును పర్యవేక్షించి సకాలంలో ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీ చేయాలని సూచించారు. ఆరోగ్య శాఖ జూన్ 29 నుంచి జులై 02 వరకు 24 గంటలూ అంబులెన్స్ సౌకర్యంతో కూడిన ప్రత్యేక మెడికల్ క్యాంప్ నిర్వహించాలన్నారు.

**గంగపట్నం పంచాయతీలో రూ. 3.56 కోట్ల అభివృద్ధి పనులు**

గంగపట్నం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వివరించారు. గత ప్రభుత్వంలో ఒక్క పని కూడా మొదలుపెట్టలేదని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనే ఒక గంగపట్నం గ్రామంలోనే రూ. 3 కోట్ల 56 లక్షల 88 వేల నిధులతో అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి నిధులలో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చాముండేశ్వరి ఆలయంలో సీసీ రోడ్లకు రూ. 70 లక్షలు, అంతర్గత సీసీ రోడ్లకు రూ. 30 లక్షలు, విలేజ్ హెల్త్ సెంటర్ భవన పనులకు రూ. 36 లక్షలు కలిపి మొత్తం రూ. 1 కోటి 36 లక్షలు ఖర్చు చేశామన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా పూడికతీత పనులకు రూ. 7.25 లక్షలు, గంగపట్నం ట్యాంక్ బండ్ రిపేర్లకు రూ. 9.55 లక్షలు, మిట్ట ట్యాంక్ పనులకు రూ. 4.75 లక్షలు, పంట కాలువల మరమ్మతులకు రూ. 17.43 లక్షలు కలిపి మొత్తం రూ. 38.98 లక్షల పనులు జరిగాయని చెప్పారు. తాగునీటి సరఫరా కోసం పైపు లైన్, బోర్లు, మోటార్లకు రూ. 25 లక్షలు, కాలువ మూల కండ్రిగలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ కోసం రూ. 37 లక్షలు కలిపి మొత్తం రూ. 62 లక్షలు ఖర్చు చేశామన్నారు. విద్యుత్ శాఖ ద్వారా నూతన ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటుకు రూ. 11 లక్షలు, 40 కొత్త ఎలక్ట్రిక్ స్తంభాలు, వైర్ల మార్పిడికి రూ. 7 లక్షలు, ఆర్‌డిఎస్ఎస్ పథకం కింద రూ. 80 లక్షలతో 70 శాతం పనులు పూర్తి చేశామని, ఈ శాఖలో మొత్తం రూ. 98 లక్షల పనులు జరిగాయని ఎమ్మెల్యే తెలిపారు. వీటితో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 12 చెక్కుల ద్వారా రూ. 21 లక్షల 90 వేలు పేదలకు అందించామన్నారు.

**నియోజకవర్గంలో రోడ్డు పనుల వేగవంతం**

గతంలో శంకుస్థాపన చేసి ఆగిపోయిన మైపాడు – నెల్లూరు రోడ్డు పనులను శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని, ఆ రోడ్డు పూర్తి చేసి ప్రజలందరికీ తెలుగుదేశం పార్టీ తరపున బహుమతిగా అందిస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డబుల్ ఇంజిన్ సర్కార్‌లా, ప్రధాని మోడీ సహకారంతో అస్తవ్యస్తమైన ఆర్థిక వ్యవస్థను సరిదిద్దుతూ, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం, 'సూపర్ సిక్స్' పథకాలను అక్షరాలా 'సూపర్ హిట్' చేశామన్నారు. గత 37 ఏళ్లుగా పక్కన పడిపోయిన కిసాన్ సెజ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చొరవతో కదలిక వచ్చిందన్నారు. అక్కడ దాదాపు రూ. 15,000 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు రాబోతున్నాయని, యువత ఉద్యోగాల కోసం వలస వెళ్లే అవసరం లేదన్నారు.

**ఇళ్ల స్థలాల అక్రమాలపై విచారణ**

గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాల కేటాయింపులో తీవ్ర అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే మండిపడ్డారు. కేవలం గంగపట్నం లేఅవుట్లలోనే రూ. 40 లక్షలకు అక్రమ కొనుగోళ్లు జరిగాయని గ్రామస్తులు తన దృష్టికి తెచ్చారన్నారు. రాబోయే రెండు నెలల్లో నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలంతో పాటు, కట్టుకునేందుకు పక్కా ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్, ఆలయ పాలక మండలి సభ్యులు, గ్రామ నాయకులు, కూటమి నాయకులు, ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మార్కెట్ నిర్వహణలో ప్రమాదకరమైన వ్యూహం - ఉద్దేశపూర్వక మార్కెట్ పతనాలు ప్రపంచ నమ్మకాన్ని ఎలా దెబ్బతీస్తాయి

విదేశీ మూలధనం వేగంగా వెనక్కి వెళ్తున్న సమయాల్లో మదుపరుల మనస్సుల్లో ఒక ఆలోచన మెదులుతుంటుంది, అదేమంటే మార్కెట్ నియంత్రణ సంస్థలు, విధాన నిర్ణేతలు మార్కెట్‌ను ఉద్దేశపూర్వకంగా అలా పడిపోనిస్తే ఏమవు తుంది!? అలా పడిపోనిస్తే మంచిదని ఇటీవల ఎన్‌డి టివిలో శంకర్ శర్మ ఉచిత సలహా మన దేశ మార్కెట్ నియంత్రణ సంస్థలకు ఇచ్చారు. దీంతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు పెట్టుబడి పెడతారని ఛలోక్తులు విసిరారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తీవ్రంగా షేర్లను విక్రయిస్తున్నప్పుడు, మార్కె ట్ విలువలు వేగంగా పడిపోవడానికి మార్కెట్ నియంత్రణ సంస్థలు అనుమతిస్తే, అది వారి సహనానికి పరీక్షగా మారుతుందని పైన పేర్కొన్న ఆలోచన యొక్క ఉద్దేశం. మార్కెట్ విలువలు బాగా పడిపోవడం వల్ల ఇకపై అమ్మకాలు చేయడం వారికి లాభదాయకంగా అనిపించదని, ఫలితంగా వారు అమ్మకాలను ఆపి, చివరికి మార్కెట్ నియంత్రణ సంస్థలు సృష్టించిన ఈ తక్కువ ధరలకే మళ్లీ కొనుగోలు చేయడానికి వస్తారని శంకర్ శర్మ భావన. కానీ ఇది మానసికంగా ఒక ప్రమాదకరమైన వ్యూహం. ప్రపంచ ఆర్థిక రంగంలో, మార్కెట్ పతనాన్ని ఉద్దేశపూర్వకంగా పక్కన నిలబడి చూడటం వల్ల అమ్మకాలు ఆగవు సరే కదా-విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఆ మార్కెట్‌ను చూసే విధానమే పూర్తిగా మారిపోతుంది. ఒక దేశం లేదా నియంత్రణ సంస్థ తన ఆర్థిక వ్యవస్థలో ఇటువంటి పతనాన్ని కావాలనే అనుమతించినప్పుడు, అది కేవలం మార్కెట్ పాయింట్లను మాత్రమే కోల్పోదు; అంతర్జాతీయ సంస్థల నమ్మకాన్ని కూడా పూర్తిగా కోల్పోతుంది. అంతర్జాతీయ పెట్టుబడుల ప్రపంచంలో, నమ్మకాన్ని సంపాదించడానికి సంవత్సరాలు పడితే, దాన్ని తిరిగి పొందడానికి దాదాపు 20 ఏళ్లకు పైగా పడిందంటే ఆశ్చర్యమే కాదు. సార్వభౌమత్వ రిస్క్ ప్రీమియం: ఒక మార్కెట్ పతనం అనేది కేవలం ఆర్థిక చక్రాల వల్ల జరిగింది కాదని, అది ప్రభుత్వ విధానాల వల్ల ఉద్దేశపూర్వకంగా అనుమతించబడిందని అంతర్జాతీయ పెట్టుబడిదారులు గ్రహించినప్పుడు, వారు దాన్ని "తక్కువ ధరకే దొరికే స్టాక్స్" లా చూడరు. బదులుగా ఆ వ్యవస్థలోని అస్థిరతగా భావిస్తారు.

**"కనిష్ట విలువ" అనే భ్రమ :**

ఈ వ్యూహం ఎందుకు ఎదురుదెబ్బ తింటుందో అర్థం చేసుకోవాలంటే, ఒక FII అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌ను ఏ కోణంలో చూస్తుందో అర్థం చేసుకోవాలి. విదేశీ మూలధ నం ఒంటరిగా పనిచేయదు. ఒక FII ఒక దేశంలో బిలియన్ల కొద్దీ డాలర్లను పెట్టుబడిగా పెడుతున్నప్పుడు, వారు మూడు రకాల రిస్క్‌లను పరిగణనలోకి తీసుకుంటారు.

1). ఆస్తి రిస్క్ : ఆ కంపెనీ లాభాల్లో ఉందా?

2). కరెన్సీ రిస్క్: మారకపు రేట్ల హెచ్చుతగ్గుల వల్ల తమ లాభాలు తుడిచి పెట్టుకుపోతాయా?

3). సంస్థాగత రిస్క్ : అక్కడి నియంత్రణ సంస్థలు ,విధాన నిర్ణేతలు పారదర్శకంగా, నమ్మదగినదిగా ఉన్నారా?

FIIల అమ్మకాలను అడ్డుకోవడానికి విధాన నిర్ణేతలు ఉద్దేశపూర్వకంగా మార్కెట్‌ను పతనం కావడానికి అనుమతించినప్పుడు, వారు ఈ మూడో రకమైన నమ్మకాన్ని పూర్తిగా నాశనం చేస్తారు. ఒక FII దృష్టిలో ఉద్దేశపూర్వకంగా పతనం కావడానికి వదిలేసిన మార్కెట్ ఎంతమాత్రం స్వేచ్ఛా మార్కెట్ కాదు, అది ఒక నియంత్రిత మార్కెట్. అంతర్జాతీయ ఫండ్ మేనేజర్లు ఆ తక్కువ విలువలను చూసి, "ఎంత మంచి డిస్కౌంట్!" అని అనుకోరు. బదులుగా, "ఇక్కడ ఆట నియ మాలు ఎప్పుడైనా మారవచ్చు, రెఫరీనే స్వయంగా మమ్మల్ని దెబ్బతీయడానికి చూస్తున్నాడు" అని భావిస్తారు. దీనివల్ల అమ్మకాలు ఆగకపోగా, మార్కెట్ నుండి పెట్టుబడులను పూర్తిగా ఉపసంహరించుకునే భయాందోళనలు మొదలవు తాయి. తాము నమ్మిన సంస్థాగత పునాది కూలిపోయిందని గ్రహించడం వల్ల విదేశీ మూలధనం మరింత వేగంగా బయటకు వెళ్ళిపోతుంది.

కోల్పోయిన విశ్వసనీయత యొక్క 20 ఏళ్ల నీడ:

మార్కెట్ పతనాలను నియంత్రించాలని లేదా విదేశీ విక్రేతలను శిక్షించాలని ప్రయత్నించి, ఆ తర్వాత ఒక తరం పాటు ఆర్థికంగా వెనుకబడిపోయిన దేశాల ఉదాహరణలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి. ఒక మార్కెట్ తన నమ్మకాన్ని కోల్పోతే, అది సులభంగా 20 ఏళ్లకు పైగా సుదీర్ఘ నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది.

ఇండెక్స్ బహిష్కరణ:

MSCI లేదా FTSE వంటి అంతర్జాతీయ బెంచ్‌మార్క్ సూచీలు మార్కెట్ యొక్క పారదర్శకతను నిరంతరం పర్యవేక్షిస్తాయి. మార్కెట్ సహజ గమనాన్ని మార్చడానికి ప్రయత్నించే దేశాల రేటింగ్‌ను ఈ సూచీలు తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం చేస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా ట్రిలియన్ల కొద్దీ డాలర్లు ఈ సూచీల ఆధారంగానే పెట్టుబడిగా వస్తాయి కాబట్టి, ఇక్కడ రేటింగ్ తగ్గితే దశాబ్దాల పాటు వచ్చే విదేశీ పెట్టుబడులు ఆగిపోతాయి.

కంపెనీల విలువలపై ప్రభావం:

కాలక్రమేణా స్థానిక రిటైల్ పెట్టుబడిదారులు మార్కెట్‌ను స్థిరపరిచినప్పటికీ, దీర్ఘకాలిక అంతర్జాతీయ మూలధనం లేకపోవడం వల్ల కంపెనీల మార్కెట్ విలువలు ఎప్పటికీ తక్కువగానే ఉండిపోతాయి. దీనివల్ల కంపెనీలకు నిధుల సేకరణ ఖరీదైనదిగా మారి, కొత్త ఆవిష్కరణలు మందగిస్తాయి.

పెట్టుబడుల జ్ఞాపకశక్తి :

ఈ రోజు మార్కెట్ పతనాన్ని చూస్తున్న యువ పోర్ట్‌ఫోలియో మేనేజర్లు, మరో 15 నుండి 20 ఏళ్లలో అంతర్జాతీయ మెగా-ఫండ్స్‌కు చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్లు అవుతారు. సంస్థాగత జ్ఞాపకశక్తి చాలా కాలం ఉంటుంది. ఒకసారి నమ్మకం కోల్పోయిన దేశాన్ని, ఆ ఆర్థిక వ్యవస్థ కోలుకున్న తర్వాత కూడా పెట్టుబడి సంస్థలు చాలా కాలం పాటు బ్లాక్‌లిస్ట్‌లోనే ఉంచుతాయి.

మార్కెట్ నిర్వాహకుల నిజమైన పాత్ర

FIIలతో ఇటువంటి పంతాలకు పోవడం అనేది అంతర్జాతీయ పెట్టుబడుల స్వభావాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోవడం వల్లే జరుగుతుంది. మార్కెట్లు ఎప్పుడూ పైకే వెళ్లాలని FIIలు కోరుకోరు. వారు మార్కెట్ హెచ్చుతగ్గులను, ఆర్థిక మందగమనాన్ని వ్యాపారంలో ఒక భాగంగా అంగీకరిస్తారు. కానీ వారు అంగీకరించలేనిది పారదర్శకత లేకపోవడాన్ని, అనాలోచిత విధానాలను మాత్రమే. మార్కెట్ నియంత్రణ సంస్థల లేదా విధాన నిర్ణేతల పాత్ర షేర్ల ధరలను కృత్రిమంగా నిర్ణయించడం కాదు, లేదా అమ్మే వారిని శిక్షించడం అంతకంటే కాదు. వారి అసలు పాత్ర మార్కెట్‌లో స్థిరమైన, పారదర్శకమైన , సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం. అంతర్జాతీయ పరిణామాల వల్ల FIIలు అమ్మాలనుకుంటే, మార్కెట్ ఆ అమ్మకాలను సమర్థవంతంగా తట్టుకునేలా ఉండాలి. విదేశీ ఫండ్ మేనేజర్లను లొంగదీసుకోవడానికి మార్కెట్ నియంత్రణ చేయటం అనేది అత్యంత ఘోరమైన విధానపరమైన తప్పు. ఆ విదేశీ సంస్థాగత విక్రేతలు కేవలం తమ పెట్టుబడులను మరో దేశానికి మార్చుకుంటారు, కానీ మనదేశం మాత్రం కోల్పోయిన తన నమ్మకాన్ని తిరిగి సంపాదించుకోవడానికి ఒక తరం పాటు (కనీసం 20 ఏళ్లు) వేచి చూడాల్సి వస్తుంది.

# పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధితులతో అహంకార ధోరణిలో లోకేష్ వ్యవహారం : జమ్మలమడక నాగమణి



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** కుటుంబ సభ్యులను కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న బాధితులతో మంత్రి నారా లోకేష్ వ్యవహరించిన తీరు అత్యంత ఆక్షేపణీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శించారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘోర ప్రమాదం సంభవించిన సమయంలో ప్రభుత్వం స్పందించిన విధానంపై ఆమె ప్రశ్నలు లేవనెత్తారు. ప్రమాదం జరిగిన రోజు రాత్రి పల్లా శ్రీనివాస్‌ను, అనంతరం బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన మంత్రి నారా లోకేష్‌ను స్థానికులు నిలదీయాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటని అన్నారు. స్టీల్ ప్లాంట్‌లో ఇటీ వల కార్మికుల సంఖ్యను తగ్గించి ఉత్పత్తిని పెంచే ప్రయత్నాలు చేయడం కూడా ప్రమాదానికి ఒక కారణమై ఉండవచ్చని నాగమణి పేర్కొన్నారు. యంత్రాల నిర్వహణ, భద్రతా తనిఖీలు, ప్రమాద నివారణ చర్యలు సక్రమంగా చేపట్టకపోవడం వల్లే ఈ దుర్ఘటన చోటు చేసుకుందని ఆరోపించారు. ఉత్పత్తిపై చూపుతున్న శ్రద్ధను కార్మికుల భద్రతపై చూపకపోవడం బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి ప్రభుత్వం తరపున భరోసా కల్పించాల్సిన మంత్రి, అక్కడి ప్రజలతో మాట్లా డుతూ మీ కుటుంబంలో వాళ్లు చనిపోలేదుగా, మీకెందుకని వ్యాఖ్యానించారని ఆమె ఆరోపించారు. ఆత్మీయులను కోల్పోయి శోకసంద్రంలో ఉన్న వారితో ఒక బాధ్యతగల ప్రజాప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని మండిపడ్డారు. ప్రమాదంలో మరణించిన కార్మికులంతా తమ కుటుంబాల భవిష్యత్తు కోసం కష్టపడుతూ ప్రాణాలు కోల్పోయారని, అలాంటి కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఆలస్యం చేయడం దురదృష్టకరమని అన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కార్మికుడు పైడిరాజు తన కుమారుడితో జరిపిన సంభాషణ ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తోందని పేర్కొన్నారు. అలాగే, గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సమయంలో జరిగిన ఎల్‌జీ పాలిమర్స్ ఘటనలో ప్రభుత్వం స్పందించిన తీరును ప్రస్తుత పాలకులు ఆదర్శంగా తీసుకోవాలని నాగమణి సూచించారు. ఆ సమయంలో బాధిత కుటుంబాలకు కోటి రూపాయల వరకు నష్టపరిహారం అందజేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు.

# ప్రజలకు చేరువగా ఉంటేనే పదవులు సాధ్యం

### - "సర్" శిక్షణలో ఎమ్మెల్యే చినరాజప్ప

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మున్సిపల్ ఎన్నికల సమయం దగ్గర పడుతున్న తరుణంలో వార్డులో పోటీ చేయవలసిన నాయకులు ముందుగా ప్రజలకు చేరువుగా ఉండి వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "సర్" కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నాయ కత్వం వహించాలని ఆశఉన్న ప్రతివారు తొలిత వార్డులోని ప్రజలకు దగ్గరగా ఉండి వారి సమస్యలను తెలుసుకొని వాటిని అధికారులు దృష్టికి తీసుకు వెళ్లడం ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అది జరిగినప్పుడు ప్రజలకు అత నిపై నమ్మకం వస్తుందన్నారు. ఇప్పటికే పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చురుకుగా చేపడుతూ ప్రజల సమస్యలకు పరిష్కారం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సమయంలో నాయ కులు కార్యకర్తలు అంతా ఐక్యంగా ఉండి రానున్న రోజుల్లో పార్టీ విజయానికి అంతా కలసి పనిచేయాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్య తనిస్తూ ముందుకెళుతున్నందున ఆయన ఆశయా లను క్షేత్రస్థా



యిలో నిజం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై పార్టీ నాయకులు మాట్లాడి వారి అభిప్రాయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు బదుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కంటే జగదీష్ మోహన్, బలుసు వాసు, అల్లూరి దొరబాబు, అందుగుల జార్జి చక్రవర్తి, నూనె రామారావు, పైణ్ణి శ్రీనివాసరావు, గొల్తి సత్యనారాయణ, మహిళా నాయకులు రామలక్ష్మి, కొర్లమండ శ్రీవాణి, విజయలక్ష్మి, సత్యవతి, పట్టణ పరిధిలోని పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాల్యదశ అభివృద్ధికి "ఏఐ" ఆధారిత సేవలు

### - అంగన్వాడీల శిక్షణలో పిడి లక్ష్మి



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, ఐసీడీఎస్ సేవలను మరింత సమర్థవం తంగా అమలు చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సేవలలో వినియోగించే లక్ష్యంతో "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎనేబుల్డ్ అండ్ ఎర్లీ చైల్డ్ హుడ్" అం శంపై సామర్లకోట పట్టణం, పెద్దాపురం మండలాల అంగన్వాడీలకు ఒక రోజు మండల స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. పెద్దాపురం పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్, మండలంలోని కాండ్రకోట జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లలో సిడిపివో జి. ఉష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత ప్రభుత్వ సేవల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ముఖ్యంగా బాల్య దశ అభివృద్ధి కార్యక్రమాలలో ఏఐ వినియోగం ద్వారా చిన్నారుల ఆరోగ్య స్థితి, పోషకాహార పరిస్థితులు, ఎదుగుదల ప్రమాణాలు మరియు అభివృద్ధి లోపాలను త్వరితగతిన గుర్తించి తగిన చర్యలు చేపట్టేందుకు అవకాశం కలుగుతుందన్నారు. అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ఎంతో అవసరమని, అంగన్వాడీ కార్యకర్తలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకొని సేవల నాణ్యతను మెరుగుపరచాలని ఆమె సూచించారు.

కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా పాల్గొన్న మండల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఉష, అనూష, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత వివిధ రంగాలలో విస్తృతంగా వినియోగంలో ఉన్న నేపథ్యంలో, చిన్నారుల ఆరోగ్య పర్యవేక్షణ, పోషకాహార స్థితి అంచనా, అభివృద్ధి లోపాల ముందస్తు గుర్తింపు, సేవల పర్యవేక్షణ మరియు డేటా విశ్లేషణలో వినియోగం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. అలాగే చిన్నారుల మేధో, శారీరక, సామాజిక మరియు భావోద్వేగ వికాసానికి సంబంధించిన ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ డెవలప్‌మెంట్ అంశాలపై అవగాహన కల్పిస్తూ, బాల్య దశలో సరైన సంరక్షణ, ప్రోత్సాహం అందించడం ద్వారా పిల్లల సమగ్ర అభివృద్ధిని సాధించవచ్చునన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఐసీడియస్ సూపర్‌వైజర్లు యన్ ఉమాదేవి, నిర్మల, సుల్తాన్ బీబి, నళిని, వెంకట రమణి, మంగ, చంద్రకళ, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, అంగన్వాడీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సేవలలో వినియోగించే విధానాలపై అవగాహన పెంపొందించుకున్నారు.

# "సౌత్ ఇండియా స్టార్ ఎక్సలెన్స్" అవార్డ్‌కు శంకర్ మాస్టర్ ఎంపిక




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** "సౌత్ ఇండియా స్టార్ ఎక్సలెన్స్ అవార్డు 2026కు" సామర్లకోట కరాటే మాస్టర్ శిహాన్ డి శంకర్ రావు ఎంపికయ్యారు. మార్షల్ ఆర్ట్స్ రంగంలో 25 సంవత్సరాలుగా మాస్టర్ శంకర్ చేసిన కృషితో పాటు "బ్లాక్ బెల్ట్ 5వ డాన్"గా సాధించిన ప్రతిష్ఠ, అనేక మంది విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించడం ఈ అవార్డుకు దోహద పడినట్టు శంకర్ చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జూలై 19వ తేదీన విజయవాడలోని వై ఎం కె అకాడమిలో ఈ అవార్డు ప్రధానోత్సవం జరగనున్నట్టు చెప్పారు. ఇటీవల మార్షల్ ఆర్ట్స్‌లో విరామం లేకుండా 40 నిమిషాల పాటు మార్షల్ ఆర్ట్స్‌లు ప్రదర్శించిన బృందంలో ఈయన గిన్నిస్ బుక్ రికార్డును సాధించారు. తదుపరి అతి తక్కువ వ్యవధిలోనే మార్షల్ ఆర్ట్స్ రంగంలో అరుదైన సౌత్ ఇండియా స్టార్ ఎక్స లెన్స్ అవార్డుకు ఎంపిక కావడం విశేషంగా భావి స్తున్నారు. జూలై 19లో జరిగే అవార్డు ప్రధాన ఉత్సవంలో ఈ అవార్డును అందుకోన్నట్టు మాస్టర్ శంకర్ చెప్పారు. ఈయన ప్రస్తుతం విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఏపీ స్టైల్ చీఫ్‌గా వ్యవహరిస్తూ సామర్లకోట కరాటే పాఠశాల మాస్టర్‌గా పనిచేస్తున్నారు. సౌత్ ఇండియా స్టార్ ఎక్సెన్స్ అవార్డుకు ఎంపికైన మాస్టర్ శంకర్‌కు షాటోఖాన్ కరాటే అసోసియేషన్ నాయకులు, సామర్లకోట లైన్స్ క్లబ్ నాయకులు, కాకినాడ జిల్లా పరిధిలోని మార్షల్ ఆర్ట్స్ మాస్టర్లు అభినందనలు తెలిపారు.

# చమురు ధరలపై నిరంతర పోరాటం

### - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు తాటిపాక మధు - పెట్రోల్ గ్యాస్ పెంపుపై సిపిఐ రాస్తారోకో




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం రోజురోజుకు పెంచుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల తగ్గించకపోతే దశలు వారి నిరంతరం ఉద్యమం చేపడతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు అన్నారు. సోమవారం ఉదయం సామర్లకోట మఠం సెంటర్ వద్ద పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరను తగ్గించాలని కోరుతూ సిపిఐ సామర్లకోట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తాటిపాక మధు మాట్లాడుతూ యుద్ధం పేరుతో చమురు సంక్షోభాన్ని సృష్టించి, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచడం దారుణమన్నారు. వాస్తవంగా అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ దేశంలో మాత్రం రోజు రోజుకీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతున్నారన్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెంచడంతో అనేక మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, హోటల్స్ మూత పడుతున్నాయన్నారు. అదేవిధంగా సామాన్యులు ఇంటి గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంపుతో నిత్యవసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్యుడికి బతకడమే కష్టంగా ఉందని మధు అన్నారు. కేజీ బేసిన్లో ఉత్పత్తి అవుతున్న చమురులో 50 శాతం వాటా ఏపీకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ అప్పుల్లో కూరుకుపోయిందని, ఇటువంటి నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కేంద్రంతో పోరాడి 50 శాతం వాటా ఇస్తే ఈ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడుతుందని మధు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శ పెదిరెడ్ల సత్యనారాయణ, పిల్ల రఘు, మడగల రమణ, సిగరెట్ల అర్జున్ రావు, సేలంశెట్టి సత్యనారాయణ, సారంపాటి శ్రీనివాస రావు, సారంపాటి వెంకన్న తదితర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# పూల లెహంగాలో ఆకట్టుకుంటున్న సుప్రీత.. లేటెస్ట్ లుక్ వైరల్!



సాధారణంగా సోషల్ మీడియాలో సెలబ్రిటీలకు ఊహించని పాపులారిటీ ఉంటుంది. ఆ పాపులారిటీని ఉపయోగించుకొని సెలబ్రిటీలు అభిమానులకు దగ్గర అవ్వడమే కాకుండా తమ వారసులను, కుటుంబ సభ్యులను కూడా ఆడియన్స్‌కు దగ్గర చేస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే ఇండస్ట్రీలోకి అడుగు పెట్టకముందే తల్లితో సమానంగా ఆదరణ అందుకుంటూ అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది సుప్రీత. సీనియర్ నటీమణి సురేఖ వాణి కూతురిగా సోషల్ మీడియా యూజర్స్‌కి పరిచయమైన ఈ చిన్నది అక్కడ తన తల్లితో కలిసి ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ మరింత వైరల్ అయింది.

**లెహంగా లుక్‌లో సుప్రీత అందాలు..**

ముఖ్యంగా కరోనా సమయంలో తల్లితో గడిపిన ప్రతి సందర్భాన్ని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఊహించని ప్రేక్షక ఆదరణ సొంతం చేసుకుంది. అలాంటి ఈమె ఈ మధ్యకాలంలో లంగా వోణీ, చీరకట్టులో సాంప్రదాయంగా కనిపిస్తూ మెస్మరైజ్ చేస్తోంది. ఒకవైపు సాంప్రదాయంగా కనిపిస్తూనే.. మరొకవైపు తన గ్లామర్ అందాలతో కుర్ర కారుకు కునుకు లేకుండా చేస్తోందని చెప్పవచ్చు. ఈమె ధరించిన లేటెస్ట్ లెహంగా విషయానికి వస్తే.. ఆరంబ్ బ్రైడల్ స్టూడియో డిజైన్ చేసిన ప్రింటెడ్ లంగాకు దీనికి కాంబినేషన్లో హెవీ ఎంబ్రాయిడరీతో డిజైన్ చేసిన స్లీవ్ లెస్ ఆలివ్ గ్రీన్ బ్లౌజ్ ధరించి ఆకట్టుకుంది. అలాగే ఆలివ్ గ్రీన్ కలర్ చున్నీతో తన మేకోవర్‌ను ఫుల్ ఫీల్ చేసుకుంది.

**ట్రెడిషనల్ లుక్‌కి కుర్రకారు ఫిదా..**

ఇక జుట్టును పోనీటైల్ చేసిన ఈమె.. సిల్వర్ కలర్ జువెలరీతో తన మేకోవర్‌ను ఫుల్ ఫిల్ చేసుకుంది. మొత్తానికైతే లెహంగా అందాలతో చూడచక్కని బొమ్మలా అందరి దృష్టిని ఆకర్షించింది సుప్రీత . ఇక సుప్రీత లేటెస్ట్ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. నిత్యం చిట్టి పొట్టి బట్టలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె ఈ మధ్యకాలంలో ఎక్కువగా ట్రెడిషనల్‌గా తయారవుతూ అందరి దృష్టిని ఆకట్టుకోవడంతో అమ్మడిలో మార్పు వచ్చింది అంటూ నెటిజన్స్ సరదాగా కామెంట్లు చేస్తున్నారు

**హీరోయిన్‌గా తొలి అడుగు..**

ఇక సుప్రీత సినిమాల విషయానికి వస్తే.. బిగ్ బాస్ మాజీ కంటెస్టెంట్, సీరియల్ నటుడు అమర్దీప్ చౌదరితో కలిసి చౌదరి గారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి అనే సినిమా ద్వారా హీరోయిన్గా ఇండస్ట్రీకి పరిచయం కాబోతోంది. మల్యాద్రి రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎ3 మీడియా పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని నిర్మించక ముందు ఈయన వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన శబరి సినిమాను నిర్మించారు. ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటుంది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

అప్పుడే ఇండస్ట్రీ అరంగేట్రం చేసిన సుప్రీత.. ఈ చిత్రం ద్వారా సుప్రీతా హీరోయిన్గా ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నప్పటికీ ముందుగానే నటిగా ఈమె ఇండస్ట్రీకి పరిచయమైంది. మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో వచ్చిన లేచింది మహిళా లోకం సినిమాలో కీలక పాత్ర పోషించింది సుప్రీత. అలా ఈ సినిమాతో నటిగా అరంగేట్రం చేసింది. కార్తీక్ – అర్జున్ దర్శకత్వంలో కామెడీ ఎంటర్టైనర్‌గా వచ్చిన ఈ సినిమాలో సుప్రీతా కీలకపాత్ర పోషించింది. ప్రస్తుతం పలు టీవీ షోలలో హోస్ట్‌గా వ్యవహరిస్తూ దూసుకుపోతోంది.


# సాయిపల్లవి సలహాతో గండం నుంచి గట్టెక్కిన అనుపమ!



దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనదైన నటనతో.. చురుకైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న నటి అనుపమ పరమేశ్వరన్ తన జీవితంలోని ఓ చీకటి అధ్యాయాన్ని.. ఆ సమయంలో తనకు లభించిన ఒక ఆత్మీయ మద్దతును ఇటీవల రివీల్ చేసారు. 2021వ సంవత్సరం తన వ్యక్తిగత – వృత్తిపరమైన జీవితంలో అత్యంత కష్టమైన కాలమని గుర్తు చేసుకున్నారు. ఆ మానసిక ఒత్తిడి నుండి బయట పడటానికి తనలోని సరికొత్త కళాత్మక కోణాన్ని ఆవిష్కరించుకోవడానికి తోటి నటి సాయి పల్లవి ఎలా సహాయపడిందో? అనుపమ వివరించారు. 2021లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోవిడ్ పరిస్థితులు.. కెరీర్‌లో ఎదురైన కొన్ని ఒడిదుడుకులు అనుపమను తీవ్రమైన మానసిక ఆందోళనకు గురి చేసాయి. ఆ సమయంలో ఇండస్ట్రీ సహా బయట వ్యక్తులు చాలా మందితో కమ్యూనికేషన్ తెగిపోయింది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సాయి పల్లవి ఆమెకు అండగా నిలిచారు. ఒక నటిగా కాకుండా మంచి స్నేహితురాలిగా అనుపమ బాధను అర్థం చేసుకుని.. ఆమె మనసును ప్రశాంత పరచడానికి నిరంతరం శ్రమించారని అనుపమ కృతజ్ఞతతో చాటుకున్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి ఏదైనా సృజనాత్మక పనిపై దృష్టి పెట్టాలని సాయి పల్లవి ఆమెకు సలహా ఇచ్చారు. అందులో భాగంగానే అనుపమకు పెయింటింగ్ అలవాటును పరిచయం చేశారు. రంగులతో కాన్వాస్‌పై భావాలను పంచుకోవడం ద్వారా మనసులోని భారాన్ని దించుకోవచ్చని సాయి పల్లవి సూచించారట. అలా మొదలైన పెయింటింగ్ ప్రయాణం, అనుపమ జీవితంలో సరికొత్త ఊరటను, ప్రశాంతతను తసుకొచ్చింది. తొలినాళ్లలో కాలక్షేపం కోసం..మనశ్శాంతి కోసం వేసిన రంగులు, కాలక్రమేణా అనుపమలో సరికొత్త నైపుణ్యాన్ని వెలికితీశాయి. పెయింటింగ్ వేయడం వల్ల తన ఆలోచనలలో స్పష్టత వచ్చిందని.. తనపై తనకు నమ్మకం పెరిగిందన్నారు. ఆ కష్టకాలంలో కాన్వాస్ బోర్డు, బ్రష్‌లు తనకు అత్యంత ఆప్తమిత్రులుగా మారాయన్నారు. తనలోని ప్రతికూల ఆలోచనలన్నింటినీ రంగుల రూపంలో సానుకూలంగా మార్చుకోగలిగానని వివరించారు.

చిత్ర పరిశ్రమలో నటీనటుల మధ్య పోటీ వాతావరణం ఉంటుందనే అభిప్రాయం సమాజంలో ఉంది. కానీ ఒకే రంగంలో ఉన్న ఇద్దరు స్టార్ హీరోయిన్ల మధ్య ఇంతటి లోతైన, నిస్వార్థమైన స్నేహబంధం ఉండటం అటు అభిమానులను.. ఇటు పరిశ్రమ వర్గాలను ఎంతగానో ఆకట్టు కుంటోంది. సాయి పల్లవి చూపించిన చొరవ, మానవీయ కోణం ఆమెపై గౌరవాన్ని మరింత రెట్టింపు చేసిందని నెటిజన్లు సోషల్ మీడియాలో ప్రశంసిస్తున్నారు. కష్టాలను అధిగమించి కెరీర్ పరంగా వైవిధ్యమైన పాత్రలతో దూసుకుపోతున్న అను పమ ఇప్పటికీ ఖాళీ సమయాల్లో పెయింటింగ్ కొనసాగి స్తున్నారు. జీవితంలో ఎదురయ్యే మానసిక సవాళ్లను ఎదుర్కోవడానికి ఏదో ఒక కళ లేదా అభిరుచి ఎంతగానో తోడ్పడు తుందనే దానికి తన జీవితమే ఓ ఉదాహరణ అని పేర్కొన్నారు. నటనలోనే కాకుండా చిత్రలేఖనంలోనూ సృజనాత్మకతను చాటుకుంటూ తోటివారికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

# త్రిష.. మళ్లీ కొత్త చర్చేంటి?



సీనియర్ బ్యూటీ త్రిష పేరు మరోసారి తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. స్టార్ హీరో విజయ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి త్రిష పొలిటికల్ ఎంట్రీపై ఓ రేంజ్‌లో చర్చలు జరుగుతున్నాయి. విజయ్‌తో ఆమెకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారం, ఇటీవల ఇద్దరూ కొన్ని సందర్భాల్లో కలిసి కనిపించడం వంటి పరిణామాలు ఆ చర్చలు మరింత పెంచాయి. విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీలో త్రిష చేరబోతున్నారనే వార్తలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా విజయ్ తన తిరుచ్చి అసెంబ్లీ స్థానానికి రాజీనామా చేసిన నేపథ్యంలో అక్కడ జరిగే ఉప ఎన్నికలో త్రిష బరిలోకి దిగుతారనే ప్రచారం గట్టిగా జరిగింది. అయితే దీనిపై పార్టీ నాయకుల నుంచి ఎలాంటి అఫీషియల్ అనౌన్స్మెంట్ రాలేదు. చివరికి ఆ ప్రచారం నిజం కాలేదు. ఇక త్రిష ప్రస్తుతం పలు చిత్రాలతో బిజీగా ఉన్నారు. చేతిలో ఉన్న సినిమాలను పూర్తి చేయడంపైనే ఆమె దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో రాజకీయాల్లోకి ఆమె ఎంట్రీ ఇప్పట్లో ఉండదనే వార్తలు వచ్చాయి. అయినప్పటికీ సరైన సమయంలో ఆమె రాజకీయాల్లోకి రావచ్చనే ఊహాగానాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ఆ మొత్తం వ్యవహారానికి మరో కారణం కూడా ఉంది. 2004లో ఓసారి త్రిష సరదాగా మాట్లాడుతూ "నాకు తమిళనాడు ముఖ్యమంత్రి కావాలని ఉంది.. మరో పదేళ్లు ఆగండి" అంటూ అప్పుడు చేసిన వ్యాఖ్యలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇప్పుడు విజయ్ రాజకీయాల్లో అదరగొట్టిన వేళ.. ఆ పాట వీడియోను నెటిజన్లు మళ్లీ వైరల్ చేయడంతో పొలిటికల్ ఎంట్రీ కచ్చితంగా ఉంటుందని ప్రచారం జరుగుతోంది. అలాగే విజయ్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి త్రిష హాజరు కావడం కూడా చర్చనీయాంశమైంది. దీని పొలిటికల్ సిగ్నల్‌గా కొందరు భావిస్తే, మరికొందరు మాత్రం ఫ్రెండ్లీ అటెండెన్స్‌గా చూస్తున్నారు. మరోవైపు విజయ్ రిజైన్ చేసిన స్థానంలో త్రిష పోటీ చేస్తారనే వార్తలు వచ్చినప్పటికీ, ఆ స్థానానికి రాఘవ లారెన్స్ పేరు వినిపించడం కొత్త ట్విస్ట్‌గా మారింది. అయితే ఆ ఊహాగానాలన్నింటికీ త్రిష ఇటీవల తన న్యాయవాది ద్వారా విడుదల చేసిన లీగల్ స్టేట్మెంట్‌తో చెక్ పెట్టేందుకు కూడా ప్రయత్నించారు. తనను ఏ రాజకీయ పార్టీతోనూ లింక్ పెట్టవద్దని, తాను కేవలం నటిగా మాత్రమే గుర్తింపు పొందాలని ఆమె స్పష్టం చేశారు. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలు పబ్లిక్ చర్చగా మార్చడం సరికాదని పేర్కొన్నారు. అంతేకాదు, తన పేరును రాజకీయ వివాదాల్లోకి లాగుతూ తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాజకీయాలకు దూరంగా కొనసాగుతున్నానని త్రిష స్పష్టం చేశారు. ఏదేమైనా త్రిష పొలిటికల్ ఎంట్రీపై ఇప్పటి వరకు ఎలాంటి క్లారిటీ లేదు. పాత వీడియోలు, సోషల్ మీడియా ప్రచారం, విజయ్ తో రిలేషన్ వంటి అంశాలే ఆ రూమర్లకు కారణమయ్యాయి. అదే సమయంలో లాయర్ ద్వారా త్రిష క్లారిటీ ఇచ్చినా.. ఇప్పుడు మళ్లీ కొత్త చర్చేంటి అంటూ కొందరు అభిమానులు కామెంట్లు పెడుతున్నారు.

# అందాల 'జాన్వీ'.. తెలుగులో సరైన ఛాన్స్ పడితే..



స్టార్ హీరోల సరసన నటించే ఛాన్స్ కోసం ఎంతో మంది హీరోయిన్లు ఎదురు చూస్తుంటారు. కానీ బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కు మాత్రం టాలీవుడ్‌లో తొలి రెండు ఛాన్సులు ఎన్టీఆర్, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోల పక్కన దక్కాయి. కెరీర్ పరంగా చూస్తే ఇది మంచి స్టార్టింగే. కానీ నటిగా తన టాలెంట్ ప్రూవ్ చేసుకునే విషయంలో మాత్రం ఆమె ఇంకా వెయిటింగ్ స్టేజ్ లో ఉన్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దివంగత అతిలోకసుందరి శ్రీదేవి కుమార్తెగా బాలీవుడ్‌లో అడుగుపెట్టిన జాన్వీ కపూర్, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ట్రై చేస్తున్నారు. హిందీలో విభిన్నమైన కథలు, ఎమోషన్స్‌కు ఇంపార్టెన్స్ ఉన్న రోల్స్ చేస్తూ నటిగా తన యాక్టింగ్‌తో మంచి మార్కులు సంపాదించారు. అదే సమయంలో తెలుగు ప్రేక్షకుల ముందుకు కూడా వరుస క్రేజీ ప్రాజెక్టులతో వచ్చారు. ఎన్టీఆర్ హీరోగా, కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన దేవరతో జాన్వీ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ చిత్రంలో ఆమె తంగం పాత్రలో కనిపించారు. అయితే ఆ రోల్‌లో కథలో ఆశించిన స్థాయిలో ఇంపార్టెన్స్ లేకపోవడంతో, జాన్వీ యాక్టింగ్ ను కంప్లీట్ రేంజ్‌లో చూసే అవకాశం ప్రేక్షకులకు దక్కలేదు. ఆ తర్వాత రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వచ్చిన పెద్దిలో ఆమె అచ్చియమ్మ రోల్ చేశారు. ఆ సినిమాపై కూడా అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. కానీ విడుదల తర్వాత మరోసారి జాన్వీ పాత్ర గురించే చర్చ మొదలైంది. యాక్టింగ్ కు పెద్ద స్కోప్ లేకుండా, గ్లామర్‌కే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇచ్చారనే విమర్శలు సోషల్ మీడియాలో కనిపించాయి. దీంతో జాన్వీ రోల్స్ సెలక్షన్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు స్టార్ హీరోల సినిమాల్లో భాగమవ్వడం కూడా పెద్ద విజయమేనని చెబుతుంటే, మరికొందరు మాత్రం ఆమె తన యాక్టింగ్‌ను చూపించే పాత్రలను ఎంపిక చేసుకోవాలని సూచిస్తున్నారు. వరుసగా రెండు తెలుగు చిత్రాల్లోనూ పూర్తి స్థాయి పాత్రలు దక్కకపోవడం అభిమానులను కొంత నిరాశకు గురి చేసింది. అయితే దీనిని పూర్తిగా జాన్వీ నిర్ణయాల వల్లే జరిగిందని అనుకోకూడదని పలువురు ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే హిందీలో ఆమె ఇప్పటికే పలు విభిన్న పాత్రలు చేసి తన స్టామినా ప్రూవ్ చేసుకున్నారు. రోల్ కోసం కష్టపడే యాక్ట్రెస్‌గా అనే పేరు కూడా సంపాదించారు. అయితే ఇప్పుడు పెద్ది తర్వాత జాన్వీ ఇక తెలుగు సినిమాలకు దూరమవుతారనే ప్రచారం జరుగుతోంది. కానీ అది నిజమని ఇప్పుడు తేల్చేయలేం. స్ట్రాంగ్ కథ, యాక్టింగ్ స్కోప్ ఉన్న పాత్ర దొరికితే ఆమె మరో తెలుగు ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏదేమైనా అసలు సమస్య జాన్వీలో కాదు.. ఆమెకు దక్కిన పాత్రల్లోనే ఉందనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. అందం మాత్రమే కాదు, అభినయం కూడా తన బలం అని ప్రూవ్ చేసే అవకాశం టాలీవుడ్ ఆమెకు ఇంకా ఇవ్వాల్సి ఉంది. సరైన దర్శకుడు చేతిలో, స్ట్రాంగ్ రోల్ దొరికితే జాన్వీ మరో యాంగిల్‌ను తెలుగు ప్రేక్షకులు చూసే రోజు త్వరలోనే ఉండొచ్చు.

# ఆచరణకు సాధ్యం కానీ హామీలతో అధికార పగ్గాలు

## - అబద్ధాలు మోసాలతో బాబు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు : మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య









**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ప్రస్తుత చంద్రబాబు అరాచక పాలన సాగుతుందని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నర్సయ్య విమర్శించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఆల్తి ఫంక్షన్ హాల్‌లో "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" పై అవగాహన సదస్సు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అబద్ధాలు, మోసంతో చంద్రబాబు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని రెండేళ్లు పూర్తయిన అమలు చేయలేదని అన్నారు. లేనిది ఉన్నట్లు చూపిస్తూ ప్రజలను చంద్రబాబు దగా చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేసారని అన్నారు. ఆచరణ సాధ్యం కానీ హామీలు అధికారం కోసం ఇచ్చి అధికారంలోనికి రాగానే హామీలను మరిచారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అంటూ ఒకటి ఉందా అనే అనుమానం ప్రజల్లో కలుగుతుందన్నారు. హామీల అమల కోసం ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు, హత్యలు ఈ ప్రభుత్వం చేయిస్తుందన్నారు. మహిళలపై నిర్దాక్షిణ్యంగా దాడులు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువనేత బొత్స సాయి గురునాయుడు, మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, వైఎస్ఆర్సిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు పల్లి సంజీవరావు, రవికుమార్, కృష్ణార్జున, వెంకటరమణ, ఎంపీపీలు బెల్లాన జ్ఞాన దీపిక, చల్ల చల్లమనాయుడు, సింహాద్రి అప్పలనాయుడు, జడ్పిటిసిలు గార తౌడు, రౌతు రాజేశ్వరి, మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు, మాజీ జెడ్పిటిసి మంత్రి అప్పలనాయుడు, మాజీ ఏఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ కోఆర్డినేటర్ బూడి వెంకట రావు, పార్టీ నాయకులు బెల్లాన తినాధరావు, నియోజకవర్గ యువ జన విభాగం కన్వీనర్ కె.పైడిపినాయుడు, పలువురు నాయకులు హాజరయ్యారు.

# జెడ్పీ ఛైర్పర్సన్ మజ్జి శ్రీనివాసరావు ఉదారత

## - కార్యకర్త కుమార్తె ఇంటర్ విద్య కోసం..రూ.లక్షా, 10 వేలు ఆర్థిక సాయం





**విజయనగరం, (రాజధాని వార్తలు):** కార్యకర్తలే ఏ పార్టీకైనా పునాదులు. అటువంటి పునాదిలాంటి కార్యకర్తల హృదయాలు గెలుచుకున్న వారే నేతలుగా, నాయకులుగా నాలుగు కాలాలు రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకుంటారు. పార్టీలో ఉండే ప్రతీ కార్యకర్తను తన కుటుంబ సభ్యుడిగా భావించిన నాయకుడు మాత్రమే వారిని, వారి కుటుంబాలను కష్టకాలంలో ఆదుకుంటాడు. వారికి అండగా నిలుస్తాడు. భరోసా ఇస్తాడు. వారి పిల్లల భవిష్యత్‌కు అవసరమైన ఆసరా అందిస్తాడు. అటువంటి రాజకీయ నాయకులను అరుదుగా చూస్తూ ఉంటాం. అలాంటి అరుదైన రాజకీయ నాయకుల్లో ఒకరిగా, తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకునే నాయకుడు విజయనగరం జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, జెడ్పీ ఛైర్పర్సన్, భీమిలి వైసీపీ ఇంచార్జ్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. ప్రజా సేవే పరమావధిగా, కార్యకర్తల శ్రేయస్సే లక్ష్యంగా అహర్నిషలు శ్రమిస్తూ, వారి సంతోష, సుఖ దుఃఖాల్లో క్షణం తీరిక లేకుండా, విరామం ఎరుగక పాటు పడే నాయకుడిగా చిన్న శ్రీనుకు కార్యకర్తల్లో మంచి గుర్తింపు ఉంది. ఆయన తాజాగా మరోసారి తమ పార్టీ కార్యకర్త కుటుంబం పట్ల తనకున్న వాత్సల్యాన్ని, ఉదారతను చాటుకున్నారు. విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం, పద్మనాభం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కంటుభుక్త శ్రీను కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని గురించి నియోజకవర్గ నాయకులు ద్వారా తెలుసుకున్న భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆ కుటుంబానికి కాస్తా ఆసరాగా నిలిచారు. కుమార్తె సిరిసహస్ర (సిరమ్మ) కూడా తన తండ్రి చూపే ఉదారతలో తానూ భాగస్వామ్యురాలిగా చేయందించారు. మృతి చెందిన వైసీపీ కార్యకర్త కుమార్తె కంటుభుక్త మాధురి ఇంటర్ విద్యలో చేర్పించడానికి అవసరమైన ఆర్థిక సాయంను చిన్నశ్రీను అందించారు. బోయపాలెం శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఆమెను ఇంటర్ విద్య కోసం చేర్పించారు. ఆమె విద్యాభ్యాసానికి అవసరమైన రూ. లక్షా, 10 వేలు ఫీజును కూడా చిన్నశ్రీను, సిరమ్మలే స్వయంగా చెల్లించి వారి కుటుంబానికి అండగా నిలిచారు. ఆ నేపథ్యంలో మంగళవారం విద్యార్థిని మాధురి, ఆమె తల్లితో కలిసి వచ్చి క్యాంప్ కార్యాలయంలో చిన్న శ్రీను, సిరమ్మను మర్యాదపూర్వకంగా కలిసి తమ కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని, మాధురి ఉన్నత స్థాయికి ఎదగాలని చిన్న శ్రీను ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం ఎంపీపీ కంటుభుక్త రాంబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పద్మనాభం ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలపై ప్రజా సానుకూలత పెంచాలి

## - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజలనుంచి సానుకూలత పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజలనుంచి తక్కువ సానుకూలత వ్యక్తమవుతున్న కొన్ని ప్రభుత్వ సేవలకు సంబంధించి, ఆ సేవలను అందిస్తున్న కొన్ని ప్రాంతాలకు చెందిన క్షేత్రస్థాయి ఉద్యోగులు, ఆయా శాఖాధిపతులతో తమ ఛాంబర్లో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పారిశుధ్యం, ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, అన్న క్యాంటీన్ల నిర్వహణ తదితర అంశాలను సమీక్షిస్తూ, ఆయా మండలాల అధికారులను ప్రశ్నించారు. అందిస్తున్న సేవలను మెరుగు పరచడమే కాకుండా, ఐవిఆర్ఎస్ ద్వారా అడిగే ప్రశ్నలపైనా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కొన్నిచోట్ల సేవలు మెరుగ్గానే ఉన్నప్పటికీ, ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల, తప్పు సమాధానం చెప్పడం జరుగుతోందని, దీనిని తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, జెడ్‌పి సిఈఓ నాగలక్ష్మి, డిఆర్‌డిఏ పిడి శ్రీనివాస పాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్.ఈ కవిత, డిపిఓ మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.


# కిషోరి వికాసం ద్వారా బాలల్లో స్వీయ అవగాహన పెంపు సెషన్ - (పిల్లల గ్రామసభ)




**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** మక్కువ, బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లాలో బాలికల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా "కిషోరి వికాసం" పేరుతో ప్రత్యేక వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నారు. మే 1 నుంచి జూన్ 11 వరకు ప్రతి సచివాలయంలో నిర్వహిస్తున్న ఈ శిబిరాలు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ టి.కనకదుర్గ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు మక్కువ మండలం, సచివాలయం-1లో కిశోరి వికాసం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలబాలికల వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య పరిరక్షణ, స్వీయ అవగాహన పెంపు లక్ష్యంగా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. విద్య ప్రాముఖ్యత, పోషకాహారం, ఋతు పరిశుభ్రత, లైంగిక మరియు పునరుత్పత్తి ఆరోగ్యం, పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణ, టీనేజ్ గర్భధారణ, మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా మాదక ద్రవ్యాల నివారణ, సైబర్ భద్రత, జీవనోపాధి అవకాశాలు, కెరీర్ కౌన్సెలింగ్, ఆర్థిక నిర్వహణ, వ్యాయామం, వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శంబర మహిళా పోలీస్ మాట్లాడుతూ బాలికల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యపై దృష్టి సారించి సమాజంలో ధైర్యంగా ముందుకు రావాలని బాలికలకు సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను శిబిరాలకు పంపించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలు తమ ఆసక్తులు, ప్రతిభలను తెలుసుకుని స్వీయ అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112, 181 (ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్), 1098 (చైల్డ్ మ్యారేజ్ హెల్ప్ లైన్ నెంబర్), 1930 (సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్), 1972 (స్టాప్ డ్రగ్ అబ్యూస్) హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి బాలిక ఈ శిబిరాల్లో పాల్గొని తన భవిష్యత్తును బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కిషోర్ బాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు విభాగం నుండి మామిడి వెంకటరమణ - ఎస్ఐ, అంగన్వాడి డిపార్ట్మెంట్ నుండి మక్కువ సూపర్వైజర్స్, సచివాలయం సిబ్బంది నుండి మహిళా పోలీస్, డి.సి.పి.యు బలగ అనిల్ కుమార్, పోలీస్ అంగన్వాడి టీచర్, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా విక్రమ సింహపురి విశ్వ విద్యాలయ 10, 11, 12వ స్నాతకోత్సవం

## - ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్, వర్సిటీ ఛాన్సెలర్ గౌరవనీయులు ఎస్.అబ్దుల్ నజీర్ - గౌరవ డాక్టరేట్లు అందుకున్న డా.కె.వి.వరప్రసాద్ రెడ్డి, గోబర్ధన్ దాస్, బీదా మస్తాన్ రావు - పాల్గొన్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం 10, 11, 12వ స్నాతకోత్సవ వేడుకలు మంగళవారం నెల్లూరు గోలగమూడి రోడ్డులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగాయి. ఈ ప్రతిష్ఠాత్మక వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సెలర్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా నెల్లూరు లోక్‌సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హాజరయ్యారు. అంతకు ముందు, స్నాతకోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్ హెలిప్యాడ్ వద్ద ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి, సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాలలో విశేష సేవలందించిన డాక్టర్ కె.వి. వరప్రసాద్ రెడ్డి (పద్మభూషణ్ అవార్డు గ్రహీత, శాంతా బయోటెక్నిక్స్ చైర్మన్), గోబర్ధన్ దాస్ (నీతి ఆయోగ్ సభ్యులు), బీదా మస్తాన్ రావు (రాజ్యసభ సభ్యులు)కి గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్లు అందుకున్న ప్రముఖులకు వేమిరెడ్డి దంపతులు పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం, గౌరవ గవర్నర్‌కి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ స్నాతకోత్సవంలో పట్టాలు అందుకున్న యూజీ, పీజీ విద్యార్థులతో పాటు, పీహెచ్‌డీ పట్టాలు అందుకున్న 21 మంది విద్యార్థులు, గోల్డ్ మెడల్స్ సాధించిన 45 మంది విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వేమిరెడ్డి దంపతులు ఆకాంక్షించారు. ఈ వేడుకలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, నెల్లూరు జిల్లాకు చెందిన ప్రముఖ నాయకులు, విశ్వవిద్యాలయ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, జిల్లా ఉన్నతాధికారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా సిపిఎం రాస్తారోకో



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తక్షణ ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ కృష్ణుడి గుడి సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ నిరసనలో సిపిఎం మండల కార్యదర్శి క్రాంతికుమార్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి జిడిపిని పెంచుతానని కానీ గ్యాస్ డీజిల్ పెట్రోల్ రేట్లు పెంచిందని అన్నారు. మేము అధికారంలోకి వస్తే 60 రూపాయలకే పెట్రోల్ ఇస్తామని, ప్రతి ఇంటికి 100 రూపాయలకే గ్యాస్ అందజేస్తామని డబ్బాలు పలికి ఎన్నికలు అయిన వెంటనే ధరల బాదుడు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కృష్ణ గోదావరి బేసిన్‌లో ఉన్న గ్యాస్ నిక్షేపాలను గుజరాతి తరలించకపోతున్న కనీసం అడగలేని దుస్థితిలో చంద్రబాబు పవన్ ఉన్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కన్నా బిజెపికి ఊడిగం చేయడానికి తెలుగుదేశం జనసేన వైసీపీలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలతో ప్రజలు ఇప్పటికే నానా అవస్థలు పడుతున్నారని ఇప్పుడు మరింత భారం మోపి ప్రజలు నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ రేట్లను తక్షణ ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ గడిగట్ల సత్తిబాబు, తుంపాల శీను, అరుణ్, మరిడియా పెంటయ్య, విశ్వనాథం, లోడు ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ పై బిఎల్ఓలకు శిక్షణ



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని బిఎల్ఓలకు వారి విధులపై అవగాహన కల్పించేందుకు ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమాన్ని పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. పెద్దాపురం రెవెన్యూ డివిజన్ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో ఆర్డీవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఎస్ఐఆర్ శిక్షణలో నిర్వహించారు. బిఎల్వోల విధులు గురించి మాస్టర్ ట్రైనీచే వివరించి వారికీ కిట్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న పరిస్థితుల్లో బూత్ లెవెల్ అధికారులు వారికి అప్పగించిన విధుల విషయమై పూర్తిస్థాయిలో సంసిద్ధులై ఉండాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో తహశీల్దార్, అసిస్టెంట్ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్, బిఎల్ఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి ట్రైనీలకు యోగా శిక్షణ





**కరప, (రాజధాని వార్తలు):** అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 నిర్వహణలో భాగంగా మంగళవారం కరప మండల ప్రజా పరిషత్, చంద్రన్న సమావేశ మందిరంలో గ్రామస్థాయి ట్రైనీలకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు పెంకే లోవరాజు ఆధ్వర్యంలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గురజనాపల్లి ఆయుష్ డిస్పెన్సరీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో ట్రైనీలకు యోగా సాధన పద్ధతులను ప్రదర్శించి, నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ట్రైనీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# కరప పీహెచ్‌సీలో సురక్షిత మాతృత్వ అభియాన్







**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక వైద్య పరీక్షలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ అఫ్రోజ్ గర్భిణులను పరీక్షించి, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి నెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనలు పాటిస్తే సుఖప్రసవాలు సాధ్యమవుతాయని ఆమె తెలిపారు. మాతా, శిశు మరణాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా రక్తపరీక్షలు, రక్తపోటు, మధుమేహ పరీ క్షలు నిర్వహించి, హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. గర్భిణుల సంక్షేమానికి ప్రతి నెల మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు దాతల సహకారంతో డ్రై ఫ్రూట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పండ్లు, రస్కులు తదితర పోషకాహార పదార్థాలు అందజేస్తున్నారు. ఈ నెల ఉయ్యూరి సాయికుమార్-దుర్గ దంపతుల కుమార్తె హన్విక ద్రీతి పుట్టినరోజు సందర్భంగా గర్భిణులకు డ్రై ఫ్రూట్స్, స్నాక్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అలాగే శొంఠి శ్రీనివాసరావు బ్రెడ్ రస్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అఫ్రోజ్, హెచ్ఎస్ రాజగోపాల్‌రావు, ఆసుపత్రి సిబ్బంది, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నక్కా వీర భద్రం, మంచాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# "స్వచ్ఛ స్వర్ణాంధ్ర" లక్ష్యాన్ని చేరుకోవాలి


## - ట్రై సైకిల్ పంపిణీలో ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్లు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** స్వచ్ఛ స్వర్ణాంధ్ర కార్యక్రమాల లక్ష్యాలను అధిగమించేందుకు పారిశుధ్య సిబ్బంది ప్రజలు పూర్తి సహకారం అందించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు పిలుపునిచ్చారు. సామర్లకోట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలకు మంజూరైన ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ముఖ్య అతిదులుగా హాజరయ్యారు. సామర్లకోట మండలంలోని గ్రామ పంచాయతీలకు మంజూరైన ట్రై సైకిళ్లను ఈ సందర్భంగా వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడంలో ఈ ట్రై సైకిళ్లు ఉపయోగ పడతాయని, స్వచ్ఛ స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రజల సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో కె హిమ మహేశ్వరి, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు నియోజక వర్గ మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి : ఢిల్లీ బాబు రెడ్డి

## - పాండిచ్చేరి సీఎంను సన్మానించిన ఢిల్లీ బాబు రెడ్డి



**తిరుపతి, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వంతో చర్చించి జర్నలిస్టు సమస్యలను పరిష్కరించాలని పాండిచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామిని ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ఢిల్లీ బాబు రెడ్డి కోరారు. పాండిచ్చేరిలోని సీఎం రంగస్వామిని కలుసుకొని శాలువాతో ఘనంగా సత్కరించి ఢిల్లీ బాబు రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీబాబు రెడ్డి మాట్లాడుతూ దాదాపు ఒక దశాబ్దం తరువాత పాండిచ్చేరి ముఖ్యమంత్రి రంగ స్వామిని కలవడం ఆనందంగా ఉందన్నారు. జర్నలిస్ట్ సమస్యలపై భారత జర్నలిస్ట్ సంఘం ప్రతినిధిగా చర్చించడం జరిగిందన్నారు. జర్నలిస్ట్ సమస్యలపై సానుకూలంగా స్పందించారనీ పేర్కొన్నారు. సీఎం రంగస్వామితో నాకు రెండు దశాబ్దాలుగా చిరు పరిచయం ఉందన్నారు. చిన్న రాష్ట్రమైనా మన ఆంధ్రప్రదేశ్‌తో అనుబంధం కలిగిన రాష్ట్రం కనుక అనేక విషయాలపై వారికి సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. పాండిచ్చేరి సీఎం కార్యాలయంలో వారిని కలిసి సత్కరించి ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ యొక్క ఘనతను తెలియజేసామన్నారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఢిల్లీ బాబు రెడ్డి ప్రతిపాదనలను సానుకూలంగా స్పందించి కేంద్రంతో ఖచ్చితంగా చర్చించి తెలియజేస్తానన్నారు. ఈ సందర్భంగా సీఎం రంగస్వామి సానుకూలంగా స్పందించినందుకు గాను ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఢిల్లీ బాబు రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# సామాన్యుల ఆత్మ బంధువు బొజ్జల రిషితా రెడ్డి : కాసరం రమేష్





**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** సామాన్యుల ఆత్మ బంధువు బొజ్జల రిషితా రెడ్డి అని శ్రీకాళహస్తి పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే సతీమణి బొజ్జల రిషితా రెడ్డి జన్మదిన వేడుకలు ఆయన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి అత్తారింటి గౌరవ మర్యాదలకు ఎక్కడా భంగం కలగకుండా చూసుకోవడమే కాక, అభాగ్యులకు అవసరమైన సేవలు అందిస్తూ శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజల గుండెల్లో గౌరవప్రథమైన స్థానం పొందారన్నారు. ఆమె సామాన్యుల ఆత్మబంధువని కొనియాడారు. బొజ్జల రిషితా రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక కుమారస్వామి తిప్ప వద్ద ఉన్న రిపబ్లిక్ క్లబ్ కూడలిలో కాసరం రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బొజ్జల బృందమ్మకి వేదపండితులు ఆశీర్వా దములు ఇచ్చి, అనంతరం చిన్న పిల్లల చేతుల మీదుగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి రెడ్డి రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గత ఎన్నికలలో సాధించిన విజయంలో కీలకపాత్ర పోషించడమే కాక, పేద ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారి కష్టనష్టాలకు తగిన పరిష్కారం కోసం చిత్తశుద్ధితో రిషితా రెడ్డి పనిచేస్తున్నారని కొనియాడారు. బొజ్జల కుటుంబ ఔన్నత్యాన్ని మరింతగా రిషితా రెడ్డి పెంచుతోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు విజయకుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంచయ్య నాయుడు, రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య, క్లస్టర్ ఇంచార్జ్ కంటా రమేష్, వన్నెకుల క్షత్రియ సభ్యులు మిన్నల్ రవి, టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఉమేష్‌రావు మోరే, ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గురప్పశెట్టి, తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి వజ్రం కిషోర్, టౌన్ బ్యాంకు చెర్మెన్ ఖాదర్ బాష, పిఏసిఎస్ చైర్మన్ బీమాల భాస్కర్, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ డీవీ నారాయణ, టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ బాలు ఢిల్లీబాబు, సోషల్ మీడియా కన్వీనర్ కోటా చంద్ర, ఆర్టీసీ రామ చంద్రయ్య, నెమల్లూరు బుజ్జి, పట్టణ అధ్యక్షురాలు సుమతి, సీనియర్ నాయకురాలు రేణుకమ్మ, చంద్రమ్మ, మునిరాజ యాదవ్, అస్మత్, రామకృష్ణ యాదవ్, వంకాయల సిద్దులయ్య, ఆర్ముగం, గంగలపూడి హరి, మణి, రాకేష్, ఎంపీ శ్రీను, కోలా సుబ్రహ్మణ్యం, నవీన్, బాబు నాయుడు, కొండ సతీష్, కాసరం శ్రీను, క్లబ్ గాంధి, లక్ష్మీనారాయణ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

# బొజ్జల కుటుంబానికి గిరిజనులు ఆత్మీయులు : బొజ్జల బృందమ్మ



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** బొజ్జల కుటుంబానికి నియోజకవర్గంలోని గిరిజనులు ఆత్మీయులు అని ఎమ్మెల్యే మాతృ మూర్తి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు బొజ్జల బృందమ్మ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడు దశాబ్దాలుగా బడుగు బలహీన వర్గాలకు సేవ చేయడమే ప్రధమ కర్తవ్యంగా పెట్టుకొని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గౌరవప్రదమైన స్థానం సంపాదించుకున్న బొజ్జల కుటుంబానికి గిరిజనులు అత్యంత ఆప్తులు, ఆత్మీయులని తెలియజేశారు. ఆర్తులకు సేవ చేయడంలో ఇతరులతో పోటీ పడే స్వర్గీయ మంత్రి బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి కోడలు, శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని 18వ వార్డు పరిధిలోని కొత్త కోనేరు యస్టీ కాలనీలో వున్న గిరిజన మహిళలకు గిరిజన సలహా మండలి సభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి యం.సుబ్బయ్య సహకారంతో బొజ్జల బృందమ్మ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, గిరిజన సలహా మండలి సభ్యులు యం. సుబ్బయ్య, వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు విజయ కుమార్, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు లక్కమనేని మధుబాబు, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, గాదిపాకుల గోపీనాథ్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, చాంద్ బాషా, తిరుపతి పార్లమెంట్ నాయి బ్రాహ్మణ సాధికార సమితి సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, నూర్ మొహమ్మద్, గాజుల భగత్, తుపాకుల ప్రసాద్, చిల్లకూరు మణి, పూల శేఖర్, సులేమాన్, గంగనపల్లి రమేష్, శివ, కృష్ణమూర్తి, షాకీర్ అలీ, షఫీ, మధు, మునెమ్మ, గంగమ్మ, సుబ్బరత్నమ్మ, విశ్వనాథ్, సలార్ తదితరులు పాల్గొన్నారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్కు 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# మోదీ యుగం: విధాన నిశ్చలత నుంచి వికసిత్ భారత్ వైపు

2014 నుంచి భారతదేశం అద్భుతమైన పురోగతిని సాధించింది. ఆర్థిక వ్యవస్థ మునుపటి కంటే ఎంతో బలోపేతమైంది, మౌలిక సదుపాయాలు స్పష్టమైన వృద్ధిని కనబరిచాయి, మహిళలు మరింత సాధికారత సాధించారు, రైతులకు మెరుగైన ధరలు లభిస్తున్నాయి, పేదలు మరింత సురక్షితంగా ఉన్నారు. ఈ మార్పులన్నింటి వెనుక ఒకే ఒక ఉమ్మడి సూత్రం.. ప్రధానమంత్రి మోదీ దూరదృష్టి, నాయకత్వం. భారతదేశ ప్రజలు ఆయన దూరదృష్టి, మానవీయ నాయకత్వానికి అండగా నిలిచారు. జూన్ 10 నాటికి ఆయన దేశానికి 4,399 రోజుల పాటు సేవలు అందించి, తొలి ఎన్నికల విజయం తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ కొనసాగిన పదవీకాలాన్ని అధిగమించి, దేశంలోనే అత్యంత సుదీర్ఘకాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రిగా రికార్డు సృష్టించారు. ఈ చారిత్రాత్మక మైలురాయి భారతదేశ ప్రజాస్వామ్య ప్రయాణంలో ఒక ముఖ్యమైన ఘట్టం. 2014లో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమై, మునుపటి యూపీఏ ప్రభుత్వ హయాంలో పాలసీ పక్షవాతం, అవినీతి, కుంభకోణాలు, వివాదాల కారణంగా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న సమయంలో దేశ ప్రజలు మోదీ ప్రభుత్వానికి నిర్ణయాత్మకమైన పగ్గాలను అందించారు.

మానవీయ నాయకత్వం - 2014 నుంచి దేశం ఒక పరివర్తనాత్మక ప్రయాణాన్ని సాగిస్తోంది. మోదీ ప్రభుత్వం 81 కోట్లకు పైగా ప్రజలకు ఉచిత ఆహార ధాన్యాలను అందించింది, 58 కోట్ల జన్‌ధన్ బ్యాంకు ఖాతాల ద్వారా ఆర్థిక సాధికారతను సాధ్యం చేసింది, 16 కోట్ల గృహాలకు నల్లా నీటి కనెక్షన్లను అందించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకమైన ఆయుష్మాన్ భారత్ ద్వారా 12 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సకు భరోసా లభించింది. నేటి యువ భారతీయులకు, మోదీ మొదట గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత ప్రధానమంత్రిగా ప్రవేశపెట్టిన ఈ పరివర్తనాత్మక మార్పులకు ముందు జీవితం ఎంత సవాలుతో కూడుకుని ఉండేదో ఊహించడం కష్టం కావచ్చు. భారతదేశ వారసత్వంపై గర్వాన్ని, ప్రతిష్టాత్మక అభివృద్ధి ఎజెండాతో ముడిపెడుతూ, ఆయన తీసుకున్న నిర్ణయాత్మక, మానవీయ నాయకత్వం దేశాన్ని వికసిత్ భారత్ 2047 మిషన్ వైపు నడిపిస్తోంది.

**నారీ శక్తి**

ప్రధానమంత్రి దృష్టిలో మహిళలు కేవలం సహాయం పొందే లబ్ధిదారులు మాత్రమే కాదు, వారు దేశాన్ని నిర్మించే నిర్మాతలు. ఇందుకోసం మొదట ప్రాథమిక అవసరాలపై దృష్టి సారించారు: స్వచ్ఛ భారత్ మిషన్ కింద 12 కోట్లకు పైగా మరుగుదొడ్లను నిర్మించి, మహిళల భద్రత, గౌరవాన్ని పెంపొందించారు; అదే



సమయంలో ఉజ్వల యోజన కింద 10 కోట్లకు పైగా ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లను అందించి, పొగతో నిండిన వంటగదుల ముప్పు నుంచి మహిళలకు విముక్తి కలిగించారు. బేటీ బచావో, బేటీ పఢావో చొరవ ద్వారా ఆడపిల్లల విద్య, సంక్షేమ ప్రాముఖ్యతను బలోపేతం చేశారు. నారీ శక్తి వందన్ అధీనియం ద్వారా దేశ శాసనసభలలో మహిళలకు మరింత ప్రాతినిధ్యాన్ని కల్పిస్తూ, మహిళల నేతృత్వంలోని అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి ప్రధాని భరోసా ఇచ్చారు.

**రైతుల సంక్షేమం**

ప్రధాని మోదీ విధానాలలో రైతు సంక్షేమం ప్రధాన అజెండాగా ఉంది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతుల సహకారానికి గుర్తింపుగా నేరుగా వారి ఖాతాల్లోకే ఆర్థిక సహాయం బదిలీ జరుగుతుంది. ఈ పథకం కింద దాదాపు 10 కోట్ల రైతు కుటుంబాలకు రూ.4.28 లక్షల కోట్లకు పైగా నిధులు పంపిణీ జరిగింది. ప్రభుత్వం కనీస మద్దతు ధరను పెట్టుబడి వ్యయం కంటే కనీసం 1.5 రెట్లు పెంచింది. అంతేకాక, అంతర్జాతీయంగా ఎరువుల ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ, రైతులకు సరసమైన ధరలకే ఎరువులు అందేలా చేయడం ద్వారా వారిపై భారం పడకుండా రక్షించారు.

**యువతకు అవకాశాలు**

యువ భారతీయుల కోసం అవకాశాలను సృష్టించేందుకు మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలు రూపొందించడం జరిగింది. నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం ద్వారా ఆధునిక ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా యువతకు నైపుణ్యాలను అందించడమే కాకుండా, అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవాన్ని భారత్ సద్వినియోగం చేసుకునేలా తీర్చిదిద్దారు. స్టార్టప్ ఇండియా, ఆవిష్కరణలకు అందిన విస్తృత మద్దతు వల్ల ఎంతో మంది యువకులు ఉద్యోగాలు వెతుక్కునే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగారు. ఈ కార్యక్రమాలు దేశ ఆర్థిక వృద్ధికి, ఉపాధి కల్పనకు గణనీయంగా దోహదపడే సరికొత్త వ్యవస్థాపక విప్లవానికి బలమైన పునాది వేశాయి.

**ఆర్థిక వ్యవస్థ, జీవన సౌలభ్యం**

2014కు ముందు, పెట్టుబడిదారుల నమ్మకం క్షీణించి భారతదేశం ప్రపంచంలోని "ఫ్రజైల్ ఫైవ్" (విదేశీ పెట్టుబడులపై ఎక్కువగా ఆధారపడి, ఆర్థిక సంక్షోభాలకు సులువుగా గురయ్యే అవకాశం ఉన్న దేశాలు) ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా పరిగణించబడేది. కానీ నేడు, సాహసోపేతమైన సంస్కరణలు, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, ఆర్థిక క్రమశిక్షణ, తక్కువ ద్రవ్యోల్బణంతో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా, వ్యాపారాలు, పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారింది. గతంలో యూపీఏ ప్రభుత్వం కుదుర్చుకున్న కొన్ని అనాలోచిత ఒప్పందాల లాగా కాకుండా, ప్రస్తుత ప్రభుత్వం భారతదేశ ప్రయోజనాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అభివృద్ధి చెందిన దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేసింది; ఇది మన యువత, రైతులు, చిన్న వ్యాపారాలు, కళాకారులు, కార్మికులకు అంతర్జాతీయ అవకాశాలను అందించింది. వస్తు సేవల పన్ను, తక్కువ పన్ను రేట్లతో సహా ప్రధాన సంస్కరణల ద్వారా ప్రభుత్వం వ్యాపారాలు, మధ్యతరగతి ప్రజలలో నమ్మకాన్ని బలపరిచింది. డిజిటల్ ఇండియా చొరవ, ఇంటర్నెట్ సదుపాయాల వేగవంతమైన విస్తరణ, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలు ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావాన్ని చూపడమే కాకుండా, పౌరుల దైనందిన జీవితాన్ని మరింత సులభతరం చేశాయి. ఎన్నో పాతబడిన, చిన్నచిన్న నేరాలను చట్టాల నుంచి తొలగించడం, అనవసరమైన నిబంధనల భారాన్ని తగ్గించడం ద్వారా వ్యాపారాలకు మరింత ఊరట లభించింది. వార్షిక ఆదాయం రూ.12.75 లక్షల వరకు ఉన్న వారికి ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వడం ద్వారా మధ్యతరగతి ప్రజలకు పెద్ద ఎత్తున ఉపశమనం లభించింది.

**ఆధునిక మౌలిక సదుపాయాలు**

మోదీ ప్రభుత్వం భారతదేశ మౌలిక సదుపాయాలను వేగంగా మారుస్తోంది. 2014లో 74గా ఉన్న వినియోగంలోని విమానాశ్రయాల సంఖ్య ఇప్పుడు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగి 160 దాటింది. భారీ ఎత్తున రైల్వే విద్యుద్దీకరణ, ప్రతిష్టాత్మక బుల్లెట్ రైల్ ప్రాజెక్ట్, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల వేగవంతమైన విస్తరణ భారతదేశ మౌలిక సదుపాయాలను ప్రపంచంలోని అత్యుత్తమ ప్రమాణాల సరసన నిలబెట్టాయి. ప్రధానమంత్రి నెలకొల్పిన ఈ చారిత్రాత్మక మైలురాయి ప్రాధాన్యతను కేవలం ఆయన పదవీకాలంతో కొలవలేము; దేశ ప్రగతిలో ఆయన చూపిన పరివర్తన, సాధించిన ఫలితాల పరిమాణమే దానికి అసలైన నిదర్శనం. ఆయన నాయకత్వం పేదలు, రైతుల సంక్షేమాన్ని, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలను, ఎదుగుతున్న భారతదేశ లక్ష్యాలను పరిపాలనకు కేంద్ర బిందువుగా మార్చింది. దేశం ముందుకు సాగుతున్న కొద్దీ, 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణాన్ని సాధించాలనే పునరుత్తేజిత సంకల్పంతో ఈ పరివర్తనాత్మక ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది.

**పీయూష్ గోయల్**

(రచయిత: కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి)

# కూటమి ప్రభుత్వంలో ప్రజలపై అప్పుల భారం

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ప్రస్తుత 23 నెలల కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం పేరుతో రూ. 3.20 లక్షల కోట్లు రుణాలను తెచ్చి ఎలాంటి అభివృద్ధి చేపట్టకుండా రాష్ట్రాన్ని దోచుకు తింటుందని వైయస్ఆర్సీపీ పెద్దాపురం నియోజకవర్గ ఇన్చార్జి ధవులూరి దొరబాబు విమర్శించారు. కూటమి ప్రభుత్వ "రెండేళ్ల వెన్నుపోటు" పేరుతో చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన పెద్దాపురం పట్టణంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలంతా నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి దొరబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని అందించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. అలాగే మహిళలకు ఎలాంటి సంక్షేమ పథకాలు గాని, ప్రయోజనాలు కానీ అందించలేదన్నారు. ఈ ప్రభుత్వంలో రైతులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. చేనేత కార్మికులకు, మైనార్టీ ప్రజలకు ఎలాంటి ప్రోత్సాహం లేకుండా పోయిందన్నారు. 23 నెలలు పాలన పూర్తి చేసుకున్న కోటమి ప్రభుత్వ అభివృద్ధి పేరుతో మాత్రం లక్షల కోట్లు నిధులను అప్పుల రూపంలో తీసుకు వచ్చి వాటిని దోచుకుంటుందని ఆయన ఘాటుగా విమర్శించారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan